# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com  ఎడిటర్: బైస దేవదాస్ సెల్:9000065433  E-mail:netinijam93@gmail.com


**నమ్మలేని నిజాలు**

అపార జ్ఞానం
కొనసాగె చేతన
విజ్ఞాన బీజం

మామిళ్ల కాలం
వడగళ్ళ వర్షాలు
రాలిన రైతు.

విష జ్వరాలు
వాయుకాలుష్య కోర
విశ్వపతనం.

వేగ దూరాలు
నీ గమ్యం నీ చేతుల్లో
మృత్యు దారులు.

ఎండల గుండం
కూలీలకది గండం
జీవ ఖండనం.



– రేడియమ్
సెల్: 9291527757

**శ్రీనిజాలు**

కోటీశ్వర్లే మహిళలు
ఇక సూపర్ బజార్లతో !
పురుషులేమో ఎగాదిగా
చూస్తుంద్రు బేజార్లతో !

ఎనిమిది వేల మందికిక
మహిళలకు భవనాలు !
ఏంచక్కా చేస్తారోచ్
మొగోళ్ళు భోజనాలు !



– కందుకూరి శ్రీరాములు
సెల్:9440119245


హైదరాబాద్ గురువారం 28-5-2026 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 ▪ Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :32 సంచిక:228 పేజీలు:6 వెల: రూ.1/-


# అకాల వర్షాలతో తెలంగాణ సర్కార్ అలర్ట్..

## – సీఎం రేవంత్‌రెడ్డి కీలక సూచనలు



హైదరాబాద్, మే 27: వాతావరణ శాఖ పలు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసిన నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం అప్రమత్తమైంది. ఈ క్రమంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్రంలో భారీ వర్షాలు, బలమైన ఈదురుగాలులపై అలర్ట్‌గా ఉండాలని దిశానిర్దేశం చేశారు. ప్రత్యేకంగా ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా అదనపు ఏర్పాట్లు చేయాలని సీఎం ఆదేశించారు. ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేసి రైతులకు ఎలాంటి నష్టం కలగకుండా చూడాలని అధికారులకు మార్గనిర్దేశం చేశారు.

**టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలి..**

కల్లాల్లో నిల్వ ఉంచిన ధాన్యం వర్షానికి తడవకుండా అవసరమైన టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలని సీఎం సూచించారు. ఇప్పటికే కొనుగోళ్ళు పూర్తయిన కేంద్రాల నుంచి టార్పాలిన్లను ఇతర అవసరమైన ప్రాంతాలకు తరలించాలని పేర్కొన్నారు. రైతుల ధాన్యం భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులకు స్పష్టం చేశారు. అలాగే వాతావరణ కేంద్రం బలమైన ఈదురుగాలుల హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో అధికారులు వెంటనే స్పందించేలా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలు అవసరం లేకుండా బయటకు వెళ్లకుండా జాగ్రత్తలు పాటించాలని సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు.

# తెలంగాణ రైతులకు అలర్ట్.. రానున్న మూడు గంటల్లో వర్షాలు..

హైదరాబాద్, మే 27:: తెలంగాణలో పలు జిల్లాలకు వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. రానున్న 3 గంటల్లో మోస్తరు ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరించారు. ఆ సమయంలో గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందన్నారు. ఈ మేరకు హైదరాబాద్ సహా పలు జిల్లాలకు అలర్ట్ జారీ చేశారు.

జనగామ, మహబూబ్‌నగర్, మేడ్చల్, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో రానున్న మూడు గంటల్లో వర్షాలు కురవనున్నట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. అలాగే రంగారెడ్డి, సంగారెడ్డి, సిద్దిపేట జిల్లాలకు ఈదురుగాలుల హెచ్చరికలు జారీ చేశారు. ఈ మేరకు ఆయా జిల్లాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తెలుగు రాష్ట్రాల్లో రెండు, మూడు రోజులుగా ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురుస్తున్నాయి. కొన్ని నెలలుగా ఎండలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్న ప్రజలకు ఇది ఉపశమనం కలిగించినట్లు అయ్యింది. మరోవైపు అకాల వర్షాలతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. వర్షాల దృష్ట్యా రైతులు అప్రమత్తంగా ఉండాలని సంబంధిత అధికారులు సూచిస్తున్నారు.

# సీబీఎస్ఈ ఫలితాల్లో భారీ అవకతవకలు..

## జ్యుడీషియల్ విచారణ జరిపించాల్సిందే: రాహుల్ గాంధీ

న్యూఢిల్లీ, మే 27 సీబీఎస్ఈ పరీక్షా ఫలితాల్లో జరిగిన తప్పులపై కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు వ్యక్తమవుతున్న సంగతి తెలిసిందే. చాలా మంది విద్యార్థులకు తప్పుడు మార్కులు రావడం సంచలనం కలిగించింది. తాజాగా ఈ అంశంపై కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ స్పందించారు. సీబీఎస్ఈ ఫలితాల్లో భారీ అవకతవకలు జరిగాయని, దీనిపై స్వతంత్ర జుడీషియల్ విచారణ జరిపించాలని రాహుల్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా బుధవారం స్పందించారు.

సీబీఎస్ఈ ఫలితాల్లో జరిగిన తప్పులు, అవకతవకలపై దేశంలోని పిల్లలు, వారి తల్లి దండ్రులు షాక్‌కు గురయ్యారని రాహుల్ అన్నారు. ఈ విషయంలో ప్రధాని మోదీకి జవాబుదారీ తనం లేదని విమర్శించారు. సీబీఎస్ఈ ఫలితాల్లో భారీ అక్రమాలు జరిగాయని, దీనిపై స్వతంత్ర జుడీషియల్ విచారణ జరిపించడంతోపాటు వేగంగా విచారణ పూర్తయ్యేందుకు ఒక సిట్ ఏర్పాటు చేయాలని రాహుల్ డిమాండ్ చేశారు. పరీక్షా పత్రాల్ని మూల్యాంకనం చేసిన 'సీవోఈ ఎంపీటీ' సంస్థపై కూడా రాహుల్ ఆరోపణలు చేశారు. గతంలో ఈ సంస్థ తెలంగాణలో గ్లోబ్ ఎరేనా పేరుతో పరీక్షల్ని మూల్యాంకనం చేసింది.

# బెంగళూరులో ఎబోలా కలకలం..

## ఉగాండా మహిళలో వ్యాధి లక్షణాలు..!

న్యూఢిల్లీ, మే 27ఆఫ్రికా దేశాల లో వేగంగా వ్యాపిస్తున్న ఎబోలా వైరస్ పై ప్రపంచవ్యాప్తంగా ఆందోళనలు నెలకొన్నాయి. ఈ క్రమంలో కర్ణాటక రాజధాని బెంగళూరు లో ఎబోలా కలకలం రేగింది. ఉగాండా కు చెందిన మహిళలో ఎబోలా వ్యాధి లక్షణాలు కనిపించాయి. దాంతో ఆమెను ఆస్పత్రికి తరలించారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. 28 ఏళ్ల ఉగాండా మహిళ ఈ నెల 23న కెంపెగౌడ విమానాశ్రయంలో దిగారు.

అయితే ఎబోలా ప్రభావిత ప్రాంతాల నుంచి వచ్చే ప్రయాణికులకు అధికారులు విమానాశ్రయాల్లో స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో సదరు ఉగాండా మహిళకు కూడా స్క్రీనింగ్ పరీక్షలు చేశారు. దాంతో ఆ మహిళలో ఎబోలా వ్యాధికి సంబంధించి తేలికపాటి లక్షణాలను గుర్తించారు. వెంటనే ముందుజాగ్రత్త చర్యగా ఆమెను ఆస్పత్రికి తరలించారు. ఆమె శాంపిల్స్ సేకరించి పరీక్షల కోసం పుణేలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వైరాలజీకి పంపించారు.

మరో రెండు రోజుల్లో ఆ శాంపిల్స్ ఫలితాలు వెలువడే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. కాగా ప్రస్తుతం ఆ మహిళ ఆరోగ్యం నిలకడగానే ఉందని వైద్యులు తెలిపారు. కర్ణాటక ఆరోగ్యశాఖ ముఖ్యకార్యదర్శి రిత్విక్ రంజన్‌పాండే దీనిపై మాట్లాడారు.

ప్రస్తుతం ఆ మహిళ వైద్యాధికారుల పర్యవేక్షణలో ఉందన్నారు. ఆమెలో కన్పించిన లక్షణాలు ఎబోలాకు సంబంధించినవేనా.. కాదా.. అనే విషయంపై ముందుగానే స్పష్టత ఇవ్వలేమని చెప్పారు.

**చురక**

ప్రశ్నించే మీడియాను
పడగొట్టే వైనం
ప్రభుత్వం తెరుస్తుంది
ప్రతీకార నయనం.
మహా విశ్వ సూచీలో
మన పత్రిక భావ స్వేచ్ఛ
ప్రతీ ఏడు దిగజారి
పడే నేడు పెద్ద మచ్చ



-వేల్పుల నారాయణ
9440433475

**రాధశ్రీ రాగాలు**

ఆమె వీణాపాణి
ఆమె పద్మజు రాణి
ఆరాధ్య యగు వాణి
అనును రాధశ్రీ !!
వీర విక్రమ గుణుడు
బ్రహ్మనాయని సుతుడు
బాలచంద్రుం డతడు
అనును రాధశ్రీ !!



-రాధశ్రీ
సెల్:9494481210

# నెల్లూరులో రోడ్డు ప్రమాదం..

## 20 మందికి గాయాలు

నెల్లూరు, మే 27 కోవూరు మండలం పడుగుపాడు వద్ద రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. నెల్లూరు నుంచి కావలికి వెళ్తున్న నాన్‌స్టాప్ ఆర్టీసీ బస్సు, ఎక్స్‌కవేటర్ ఢీకొన్న ఘటన స్థానికంగా కలకలం రేపింది. ఈ ప్రమాదంలో ఇద్దరు డ్రైవర్లతో పాటు సుమారు 20 మంది ప్రయాణికులు గాయపడ్డారు. ప్రమాదం తీవ్రంగా ఉండటంతో బస్సు డ్రైవర్ క్యాబిన్‌లో ఇరుక్కుపోయాడు. స్థానికులు తీవ్రంగా శ్రమించి డ్రైవర్‌ను బయటకు తీసుకొచ్చారు.

సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన వారిని సమీప ఆసుపత్రులకు తరలించారు. ప్రమాదానికి గల కారణాలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# దక్షిణ లెబనాన్‌పై ఇజ్రాయెల్ భీకర దాడులు..

# పిల్లలతో సహా 31 మంది మృతి



హైదరాబాద్, మే 27: శాంతి చర్చలతో త్వరలోనే పశ్చిమాసియాలో యుద్ధానికి ముగింపు పలుకుతుందని ఆశించిన వారికి నిరాశే ఎదురవుతున్నది. ఓ వైపు శాంతి చర్చలు జరుగుతుండగానే ఇరాన్‌లోని దక్షిణ ప్రాంతాలపై అమెరికా తీవ్ర దాడులకు దిగింది. దీంతో పశ్చిమాసియాలో పరిస్థితులు ఒక్కసారిగా వేడెక్కాయి. దక్షిణ ఇరాన్‌లో క్షిపణి ప్రయోగ కేంద్రాలు, మైన్స్ అమర్చుతున్న పడవలపై తాము ఆత్మరక్షణ దాడులు నిర్వహించినట్టు అమెరికా సైన్యం తెలిపింది.

తాజాగా ఇజ్రాయెల్–లెబనాన్ మధ్య ఉద్రిక్తతలు మరోసారి తీవ్రరూపం దాల్చాయి. లెబనాన్ దక్షిణ ప్రాంతాలపై ఇజ్రాయెల్ జరిపిన వైమానిక దాడుల్లో పలువురు చిన్నారులతో సహా కనీసం 31 మంది మరణించారని లెబనాన్ ఆరోగ్య మంత్రిత్వ శాఖ తెలిపింది. అర్ధరాత్రి గాజాపై ఇజ్రాయెల్ రెండు చోట్ల వైమానిక దాడులకు పాల్పడింది. ఈ దాడుల్లో ముగ్గురు పాలస్తీనియన్లు మరణించగా 12 మంది గాపడ్డారు.

ఏప్రిల్‌లో ఇరు దేశాల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిన తర్వాత జరిగిన అతి పెద్ద దాడి ఇదేనని అంతర్జాతీయ మీడియా పేర్కొంది. హెజ్‌బొల్లా మిలిటెంట్లు తమ సరిహద్దు ప్రాంతాలపై రాకెట్లు ప్రయోగించారని , దానికి ప్రతిస్పందనగానే ఈ దాడులు నిర్వహించినట్లు ఇజ్రాయెల్ సైన్యం తెలిపింది.

# కేరళం మాజీ సీఎం మద్దతుదారుల నిరసన.. ఈడీ వాహనంపై దాడి

కేరళ మే 27: కేరళ మాజీ సీఎం పినరయి విజయ్ నివాసంలో ఈడి రెయిడ్స్‌ను వ్యతిరేకిస్తూ ఆయన మద్దతుదారులు రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున నిరసనకు దిగారు. బుధవారం తిరువనంతపురంలో సోదాల అనంతరం తిరిగి వెళుతున్న ఈడీ అధికారుల వాహనాన్ని అడ్డుకున్నారు. ఈ క్రమంలో కొందరు రాళ్లతో వాహనంపై దాడి చేయడంతో కారు అద్దాలు దెబ్బతిన్నాయి. ఈడీ రాక నేపథ్యంలో పినరయి విజయన్ నివాసానికి ఆయన మద్దతుదారులు భారీగా చేరుకోవడంతో పోలీసులు వారిని చెదరగొట్టారు. ఈడీ అధికారుల వాహనాన్ని అక్కడి నుంచి పంపించేశారు. కేంద్ర ప్రభుత్వం కావాలని ఈడి దాడులు నిర్వహిస్తోందని సీపీఎం నేతలు ఆరోపించారు. కొచ్చిన్ మినరల్స్ అండ్ రుటైల్ లిమిటెడ్ (సీఎంఆర్‌ఎల్) కేసులో మాజీ ముఖ్యమంత్రి పినరయి విజయన్ నివాసాలతో సహా కేరళంలోని 10 ప్రాంగణాల్లో ఈడి సోదాలు నిర్వహిస్తోంది.

తిరువనంతపురంలోని మాజీ సీఎం విజయన్ ప్రస్తుత నివాసంతో పాటు ఆయన స్వస్థలమైన కన్నూర్‌లోని మరో ప్రాంగణం, మాజీ సీఎం విజయన్ అల్లుడు, మాజీ మంత్రి మొహమ్మద్ రియాజ్‌కు చెందిన నివాసంలో (కోజికోడ్) కూడా ఈడీ రెయిడ్స్ నిర్వహించింది. సోదాల సమయంలో మాజీ సీఎం, ఆయన కుటుంబసభ్యులు ఇంట్లోనే ఉండగా బయట మద్దతుదారులు నిరసనలకు తెరతీశారు. సెక్యూరిటీ సిబ్బందిపై కొందరు దాడికి దిగే ప్రయత్నం చేయడంతో పార్టీ సీనియర్ నేతలు వారిని అడ్డుకుని శాంతింపజేసినట్టు జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి.

మాజీ సీఎం విజయన్ కూతురు వీణా విజయన్‌కు చెందిన ఐటీ సంస్థ ఎక్సాలాజిక్ సొల్యూషన్స్ నుంచి ఎలాంటి సేవలు పొందకుండానే సీఎంఆర్‌ఎల్ డబ్బులు చెల్లించిందన్న ఆరోపణల నేపథ్యంలో ఈడీ ఈ రెయిడ్స్ నిర్వహించింది. సీరియస్ ఫ్రాడ్ ఇన్వెస్టిగేషన్ ఆఫీస్ కూడా రంగంలోకి దిగింది. మొత్తం రూ.2.7 కోట్లు సీఎంఆర్‌ఎల్ నుంచి ఎక్సాలాజిక్‌కు అందినట్టు ఆరోపణలు వచ్చాయి. ఐటీ సర్వీసులు, కన్సల్టెన్సీ సేవల మాటున ఈ చెల్లింపులు సాగినట్టు ఆరోపణలు ఉన్నాయి. ఇక ఈడీ కేసును కొట్టేయాలంటూ సీఎంఆర్‌ఎల్ దాఖలు చేసిన పిటిషన్‌ను కేరళ హైకోర్టు ఇటీవలే తోసిపుచ్చింది. మరోవైపు, ఈ ఆరోపణలను మాజీ సీఎం విజయన్ గతంలోనే కొట్టిపారేశారు. తమ ఇమేజీని దెబ్బతీసే లక్ష్యంగా ఈ ఆరోపణలు పుట్టుకొచ్చాయని చెప్పారు.

# ఓటర్ జాబితా సవరణపై సుప్రీం కోర్టు కీలక తీర్పు

హైదరాబాద్, మే 27:దేశంలో ఎన్నికల నిర్వహణకు ఓటరు జాబితా సవరణ కీలకమని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఎన్నికల కమిషన్ చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియ రాజ్యాంగబద్ధమైనదేనని, దీనిపై వచ్చిన సవాళ్లను తిరస్కరిస్తూ అత్యున్నత న్యాయస్థానం వెలువరించింది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి సూర్య కాంత్ నేతృత్వంలోని ధర్మాసనం, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చీతో కలిసి ఈ తీర్పు ఇచ్చింది. ఎన్నికల కమిషన్‌కు రాజ్యాంగంలోని ఆర్టికల్ 324తో పాటు ప్రజాప్రతినిధుల చట్టం-1950 కింద ఓటరు జాబితాల ప్రత్యేక సవరణ చేపట్టే పూర్తి అధికారం ఉందని ధర్మాసనం పేర్కొంది. ఈ ప్రక్రియ ద్వారా ఎన్నికల కమిషన్ తన రాజ్యాంగబద్ధ బాధ్యతను నిర్వర్తిస్తోందని, ఇది స్వేచ్ఛాయుత ఎన్నికల లక్ష్యాన్ని మరింత బలపరుస్తుందని ధర్మాసనం అభిప్రాయపడింది.

# హైదరాబాద్ నగరంలోని పలు ఆర్టీవో కార్యాలయాల్లో ఏసీబీ సోదాలు

హైదరాబాద్, మే 27: నగరంలోని పలు ఆర్టీవో కార్యాలయాల్లో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు ఆకస్మిక సోదాలు నిర్వహించారు.

మేడ్చల్ ఆర్టీవో కార్యాలయం, నాగోల్ ఆర్టీవో కార్యాలయాలతో పాటు కొండాపూర్ ఆర్టీవో కార్యాల యంలో కూడా తనిఖీలు కొనసా గుతున్నాయి.సుమారు 8 మంది అధికారులతో కూడిన బృందాలు ఏకకాలంలో కార్యాలయాలను తనిఖీ చేస్తున్నాయి. ఆర్టీవో కార్యాలయాల్లో పనిచేస్తున్న కొంతమంది సిబ్బందిపై అవినీతి ఆరోపణలు రావడంతో ఏసీబీ ఈ దాడులు చేపట్టినట్లు సమాచారం.

# డిజిటల్ చెల్లింపులతో జర భద్రం



హైదరాబాద్, మే 27: బక్రీద్ పండుగ నేపథ్యంలో.. డిజిటల్ చెల్లింపుల (జీ పే, ఫోన్ పే, వంటివి) విషయంలో వ్యాపారులు జాగ్రత్తగా ఉండాలని హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ హెచ్చరించారు. ఇటీవల కాంచన్‌బాగ్, రాజేంద్రనగర్ పీఎస్ ల పరిధుల్లో రెండు డిజిటల్ మోసాలు వెలుగులోకి వచ్చాయని సీపీ తెలిపారు. కాంచన్‌బాగ్‌లో ఆరుగురు వ్యక్తులు ఒక వ్యాపారి తో బేరమాడి, రూ. 5వేలు చెల్లించినట్లుగా చూపించే నకిలీ యాప్ స్క్రీన్‌ను చూపించి రూ.68వేల విలువైన పశువుల తో ఉడాయించారని తెలిపారు.

అదేవిధంగా, రాజేంద్రనగర్‌లో నలుగురు వ్యక్తులు రూ.48వేల విలువైన మేకలను కొనుగోలు చేసి, నకిలీ పేమెంట్ యాప్‌తో బురిడీ కొట్టించారన్నారు. ఖాతాలో డబ్బు జమ కాలేదని గుర్తించిన బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో, మేకలు, గొర్రెల అమ్మకందారులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పశువులను అప్పగించే ముందు, వీా బ్యాంకింగ్ ఖాతాలో బ్యాలెన్స్ నిర్ధారించుకోవాలన్నారు. ఎవరైనా మోసం చేయడానికి ప్రయత్నిస్తే డయల్ 100కు కాల్ చేసి పోలీసు అధికారులకు సమాచారం అందించాలని సూచించారు.

# పాకిస్థాన్ చర్యలకు తగిన పర్యవసానాలు ఉంటాయ్..

## –ఐక్యరాజ్యసమితి భద్రతామండలి వేదికగా భారత్ వార్నింగ్

న్యూఢిల్లీ, మే 27 ఐక్యరాజ్యసమితి భద్రతామండలి వేదికగా పాకిస్థాన్ పై భారత్ తీవ్రస్థాయిలో విరుచుకుపడింది. సరిహద్దు ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తూ, సార్వభౌమత్వం, ప్రాదేశిక సమగ్రత వంటి సూత్రాలను పాకిస్థాన్ యథేచ్ఛగా ఉల్లంఘిస్తోందని ఆరోపించింది. తమపై జరిగే ఉగ్రదాడుల నుంచి తమను తాము రక్షించుకునే పూర్తి హక్కు తమకు ఉందని, పాకిస్థాన్ చర్యలకు తగిన పర్యవసానాలు ఉంటాయని గట్టిగా హెచ్చరించింది. చైనా అధ్యక్షతన జరిగిన యూఎన్ఎస్‌సీ బహిరంగ చర్చలో భారత శాశ్వత ప్రతినిధి, రాయబారి హరీశ్ పర్వతనేని మాట్లాడుతూ.. పాకిస్థాన్ చేసిన ఆధారరహిత ఆరోపణలను తిప్పికొట్టారు.

స్వతంత్ర భారతదేశం ఏర్పడిన నాటి నుంచి నిత్యం సరిహద్దు ఆక్రమణలకు వ్యతిరేకంగా పోరాడుతోందని హరీశ్ పర్వతనేని అన్నారు. చట్టబద్ధంగా, తిరిగి మార్చలేని విధంగా భారత్‌లో విలీనమైన భూభాగాలను ఆక్రమించుకోవడానికి పాకిస్థాన్ ప్రయత్నిస్తూనే ఉందని ఆయన చారిత్రక వాస్తవాలను గుర్తుచేశారు. భారత్‌ను వెయ్యి గాయాలతో రక్తమోడించాలనే పాకిస్థాన్ సిద్ధాంతం, వారి డొల్ల మాటలను బట్టబయలు చేస్తోందని అన్నారు. సరిహద్దు ఉగ్రవాదం నుంచి తనను రక్షించుకునే పూర్తి హక్కు భారత్‌కు ఉందని స్పష్టంచేశారు. తన చర్యలకు పాకిస్థాన్ తగిన పర్యవసానాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని చెప్పారు.

ఉగ్రవాదం, మత ఛాందసవాదం, హింసాత్మక రాడికలిజం వంటి దుష్టశక్తులను పాకిస్థాన్ నిరంతరం ప్రోత్సహిస్తోందని, ఇకనైనా ఉగ్రవాదానికి అన్ని విధాలుగా మద్దతును శాశ్వతంగా నిలిపివేయాలని ఆయన డిమాండ్ చేశారు. అంతకుముందు ఇదే చర్చలో పాకిస్థాన్ ఉప ప్రధాని, విదేశాంగ మంత్రి ఇషాక్ దార్ మాట్లాడుతూ.. జమ్మూకశ్మీర్ అంశాన్ని, సింధు జలాల ఒప్పందాన్ని ప్రస్తావించారు. దీనికి భారత్ బలంగా బదులిచ్చింది. 2025 ఏప్రిల్‌లో పహల్గామ్‌లో 26 మంది పౌరుల మరణానికి కారణమైన ఉగ్రదాడి తర్వాతే భారత్ సింధు జలాల ఒప్పందాన్ని నిలిపివేసిందనే సంగతి గుర్తుంచుకోవాలని చెప్పింది.

# మే 30న కర్ణాటక కొత్త సీఎం ప్రమాణస్వీకారం ..!

న్యూఢిల్లీ, మే 27 కర్ణాటకలో నాయకత్వ మార్పుపై కాంగ్రెస్ అధిష్ఠానం చురుగ్గా పావులు కదుపుతోంది. మే 30వ తేదీ శనివారంనాడు కొత్త ముఖ్యమంత్రి ప్రమాణస్వీకారం చేసే అవకాశాలున్నాయని పార్టీ వర్గాల తాజా సమాచారం. కొత్త మంత్రివర్గంలో ముగ్గురు ఉపముఖ్యమంత్రులకు చోటు కల్పిస్తారని తెలుస్తోంది. వీరిలో షెడ్యూల్డ్ కులాలకు చెందిన ఒకరు, ఓబీసీ వర్గానికి చెందిన మరొకరితో పాటు ఒక మహిళ ఉంటారు.

కర్ణాటకలో నాయకత్వ మార్పునకు మార్గం సుగమం చేయాలని, జాతీయ స్థాయిలో కీలకమైన సంస్థాగత బాధ్యత చేపట్టాలని ముఖ్యమంత్రి సిద్ధరామయ్యను పార్టీ అధిష్ఠానం కోరినట్టు విస్తృత ప్రచారం జరుగుతోంది. రాహుల్ గాంధీ నుంచి నేరుగా ఈ సందేశం రావడంతో సిద్ధరామయ్య సైతం పదవి నుంచి తప్పుకునే అవకాశం ఉందని అంటున్నారు.

**గవర్నర్ అపాయింట్‌మెంట్ కోరిన సిద్ధరామయ్య**

తాజా సమాచారం ప్రకారం, ఈనెల 28న అపాయింట్‌మెంట్ ఇవ్వాలని గవర్నర్ తావర్‌చంద్ గెహ్లాట్‌ను సిద్ధరామయ్య కోరారు. అదేరోజు తన రాజీనామా పత్రాన్ని అందజేసి, తన డిప్యూటీ డీకే శివకుమార్ ముఖ్యమంత్రి పగ్గాలు చేపట్టేందుకు మార్గం సుగమం చేస్తారు. 'గురువారంనాడు అపాయింట్‌మెంట్ ఇవ్వాలని గవర్నర్‌ను ముఖ్యమంత్రి కోరిన మాట నిజమే' అని సిద్ధరామయ్య సన్నిహితుడు ఒకరు తెలిపారు.

సిద్ధరామయ్య పదవి నుంచి తప్పుకోనున్నారనే ఊహాగానాల నేపథ్యంలో తన క్యాబినెట్ మంత్రులతో కీలకమైన బ్రేక్‌ఫాస్ట్ మీట్‌ను ఆయన గురువారం ఉదయం ఏర్పాటు చేయనున్నట్టు అధికారిక వర్గాల సమాచారం. కాగా, ఢిల్లీలో ఉన్న డీకే శివకుమార్ బుధవారం మధ్యాహ్నం బెంగళూరు చేరుకుని తిరిగి గురువారం హస్తినకు వెళ్లారు.

7

నేటినిజం
# సాహితీ కెరటాలు

website: www.netinijam.com

2 హైదరాబాద్ ఎడిటర్: బైస దేవదాస్ సెల్:9000065433 గురువారం 28-5-2026

## సప్త పదులు

ప్రక్రియా సృజనకర్త: సుధామ



మదుపు
పొదుపు

మిన్నంటే
ఇంధనవనరులు
ఆర్థిక పరిస్థితులకు
కుదుపు..

-పద్మావతి పి.
హైదరాబాద్

నేర్చుకో
ఓర్చుకో

కష్టపడి సాధించి
నీకుగా
నీవే
సమకూర్చుకో .

-యామిని కోళ్ళూరు
నెల్లూరు

జీవాత్మ
పరమాత్మ

కష్టాలను
ఓర్చుకోమంటూ
ముందుకు
నడిపించేది
అంతరాత్మ .

-వి. సుబ్బారావు
విశాఖపట్టణం

వాదన
రోదన

బాధపడి ఏడుస్తూ
కూర్చుంటే
దూరమవదు
వేదన

-మాధవి మేళ్ళచెర్వు
గుంటూరు.

తత్త్వము
మానవత్వము

సమాజాన్ని
చైతన్య పరిచేలా
రాయాలి
కవిత్వము....!!

-జి.కె.నారాయణ
జోగులాంబ గద్వాల్ జిల్లా

నాటికి
నేటికి

పుస్తకం
హస్తభూషణం
సామెత మారదు
ఏనాటికి.

-అల్లంరాజు రాధాకుమార్
హైదరాబాద్

# మీడియా నిత్యం ప్రజాపక్షమే ఉండాలి

**-మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు**

హైదరాబాద్, మే 27: సంచలనాలకి, దూరంగా సత్యానికి దగ్గరగా జర్నలిజం ఉండాలని భారత మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు అభిప్రాయపడ్డారు. శనివారం హైదరాబాద్‌లోని ఫిలింనగర్ కల్చరల్ సెంటర్లో నవ సాహితీ ఇంటర్నేషనల్ నిర్వహించిన 'గోరా శాస్త్రి స్మారక ఉత్తమ జర్నలిస్టు పురస్కార ప్రదానానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

ప్రముఖ జర్నలిస్ట్ జి. వల్లీశ్వర్‌కు పురస్కార ప్రదానం చేసిన అనంతరం మాట్లాడుతూ 'మీడియా బాధ్యతాయుతంగా ఉండాలి. సంచలనానికి దూరంగా, సత్యానికి దగ్గరగా వార్తలు రాయాలి. బ్రేకింగ్ న్యూస్ పేరుతో న్యూస్ను బ్రేక్ చేస్తున్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థకు మీడియా నాలుగో మూలస్తంభం, సమాజంలో ముఖ్యమైన వ్యవస్థలైన మీడియా నాలుగో మూలస్తంభం.

సమాజంలో ముఖ్యమైన వ్యవస్థలైన శాసన, కార్యనిర్వాహక వ్యవస్థలు తమ పరిధిని దాటినప్పుడు లేదా దారి తప్పినప్పుడు, ప్రజాపక్షం వహించి వాటిని హెచ్చరించి, సరైన మార్గంలో పెట్టే గురుతర బాధ్యత మీడియాదే. నేడు ప్రపంచం ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటోంది.

యుద్ధాలు, ఘర్షణలు, వాటి వల్ల తలెత్తుతున్న ఎన్నో సమస్యలు ప్రజల జీవితాలపై ప్రభావం చూపే అవకాశం ఉంది. వీటిని ఎదుర్కోవడానికి ప్రభుత్వాలు, మేధావులు ఎన్నో చర్యలు తీసుకుంటున్నారు. వీటిపై ప్రజలను చైతన్య పరిచి, వారిలో అవగాహన కల్పించి సమస్యల తీవ్రతను తగ్గించే గురుతర బాధ్యత మీడియాకు ఉంది. అగ్గిరాజుకున్నప్పుడు ఆర్పడానికి ప్రయత్నించాలి కానీ, దానికి ఆజ్యం పోయకూడదు అని సూచించారు. గోరా శాస్త్రిగారు, తెలుగు పత్రికా రచనలో, సాహితీ రచనలో ఆజానుబాహుడు, నిజాన్ని నిర్భయంగా, నిష్కర్షగా, కుండబద్దలు కొట్టినట్టు చెప్పి సునిశిత విమర్శతో హాస్యాన్నీ, వ్యంగాన్నీ, ధర్మాగ్రహాన్నీ, సాహితీ వైదుష్యాన్నీ సమపాళ్లలో మేళవించే గోరాశాస్త్రి సంపాదకీయాలంటే పాఠకులు చెవి కోసుకునేవారు. నేటితరం పాత్రికేయులు గోరా గారి రచనలను చదవాలి. ఇటువంటి మహానుభావుల వారసత్వాన్ని నేటి జర్నలిస్టులు నిలబెట్టాలి" అని చెప్పారు.



ప్రముఖ జర్నలిస్టు జి. వల్లీశ్వర్‌కు 'గోరాశాస్త్రి ఉత్తమ జర్నలిస్టు' పురస్కారాన్ని ప్రదానం చేస్తున్న మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు, డా॥కె.వి. రమణాచారి, డా॥ సుద్దాల అశోక్‌తేజ తదితరులు.

మాజీ ఐఏఎస్ అధికారి కేవీ రమణాచారి మాట్లాడుతూ మనిషంటే ఇలా ఉండాలపించేలా జీవించిన మహోన్నత వ్యక్తి గోరా శాస్త్రి అని అన్నారు. సుద్దాల అశోక్ తేజ మాట్లాడుతూ పాత్రికేయులు ఆసు కవులైతే తాము ఆలస్య కవులమని చమత్కరించారు. ఏ ఒరలోనూ ఇమడని ఖడ్గం గోరా శాస్త్రి అని అభివర్ణించారు.

నవసాహితి ఇంటర్నేషనల్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎస్వీ సూర్యప్రకాశ్‌రావు మాట్లాడుతూ గోరా శాస్త్రి ఉత్తమ జర్నలిస్టు పురస్కారాన్ని అందించడం ఇది మూడవ సారన్నారు. కార్యక్రమంలో భాగంగా శ్రీనివాస్ వాసుదేవ రాసిన జాతర పుస్తకాన్ని వెంకయ్యనాయుడు ఆవిష్కరించారు. నవసాహితి ఇంటర్నేషనల్ వర్కింగ్, జర్నలిస్ట్ ఆఫ్ ఇండియా సంయుక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో చండీ పరమేశ్వరీ, పీఠాధిపతి అవసరాల ప్రసాద శర్మ సిద్ధాంతి, ఎమ్మెస్కో ప్రచురణ సంస్థల అధినేత విజయకుమార్, వర్కింగ్ జర్నలిస్ట్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రావికంటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# వైద్య విజ్ఞానంపై అవగాహన

పుస్తక సమీక్ష

వనం, పొలం, పరువు ప్రతిష్ట, గౌరవం-ఏదీ చేతినుండి జారిపోయినా, తిరిగి సంపాదిం చుకోగలము. బంధుత్వా లు, మర్యాద మన్నన, పదవి-ఏదీ పోగొట్టు కున్నా, తర్వాతి కాలంలో ప్రయత్నించి పొందగలము. ఒక్క ప్రాణం తప్ప. ఎంత ప్రయత్నించినా ఎన్ని కోట్లు క్రుమ్మరించినా, తిరిగి ప్రాణాన్ని పొందలేము.

ప్రత్యామ్నాయం తిరిగి పొందగలమేమో కాని, వ్యక్తిని తిరిగి పొందగలగటం బ్రహ్మకైనా సాధ్యం కాని పని. ప్రాణాలను నిలిపే డాక్టర్లకు అందుకనే అంతటి విలువ. ప్రాధాన్యత, అందుకే **"వైద్యోనారాయణ హరిః"** అంటారు. ఏ వృత్తికి ఇవ్వని ప్రాముఖ్యత వైద్య వృత్తికి ఇస్తారు. నాటి నుండీ, నేటి వరకు వైద్యం వృత్తికి సంఘంలో అంతటి గౌరవం ఉంది.

డా॥ పెళ్ళకూరు జయప్రద సోమిరెడ్డి వృత్తి వైద్యం. ప్రవృత్తి సాహిత్యం, కొందరు మినహా అందరూ. తమ అనుభవాల్లోంచి కథలు వ్రాస్తారు. అనుభవాల్లోంచి వచ్చిన కథల్లో సహజత్వం ఉంటుంది.

సహజత్వం ఉన్న కథలు పాఠకుడి మనస్సును సున్నితంగా తాకుతాయి. కథకుడు సృష్టించిన పాత్రల్లో పాఠకులు మమేకం అవుతారు. కథకుడికీ, కథకు పాఠకుడికి మధ్య ఒక కనిపించని బంధం ఆత్మీయత. కొందొకచో, ఆరాధన, సృష్టించబడుతుంది. ఇట్లా రాయగలిగిన వారే ఇట్లా రాసిన కథలే నాలుగు కాలాల పాటు నిలుస్తాయి. పాఠకుల మన్నన పొందుతాయి. లోగడ ఈ రచయిత్రి మూడు పదులకు పైగా కథా, నవల సంపుటాల్ని వెలయిం చారు. అందులోంచి వైద్య వృత్తికి సంబం ధించిన కథల్ని ఏరి **"జయప్రద మెడికల్ కథలు-1"** గా ప్రచురించారు.

ఇది (జయప్రద మెడికల్ కథలు-2) వారి రెండవ సంపుటము. ఇందులో 14 కథలు







**ప్రతులకు:**
డా॥ పెళ్ళకూరు జయప్రద
9440279594

వైద్య వృత్తికి సంబంధించినవే ఉన్నాయి. వైద్యం వ/ఎస్ సమాజం, వైద్యంతో సమాజం ఎలా సంఘర్షిస్తుంది. వివిధ ఆర్థిక సాంఘిక సామాజిక పరిస్థితుల్లో వైద్యానికి ఎటువంటి ప్రాముఖ్యత ఇస్తారు - అన్న విషయాలని ఒక బయటి వ్యక్తిగా వైద్యం కోణంలోంచి చూస్తూ, స్పందించి వ్రాసిన కథలు ఇవి. జబ్బు అన్నది సమాజంలోని అన్ని వర్గాలని స్వపర బేధాలు లేకుండా తాకుతాయి. అలాంటి వ్యక్తులని, సమా జాన్ని, సామాజిక స్థితిగతుల్ని రచయిత్రి ఈ కథా సంపుటి ద్వారా మరోసారి మనకు అందిస్తున్నారు. ఇవి వాస్తవాల్లోంచి వచ్చిన కథలు కనుక వాడు పబ్లిష్ చేసినా, నాడు పబ్లిష్ చేసినా, ప్రజాదరణకు నోచుకుంటాయి.


రచయిత్రి కథ, కథన నైపుణ్యానికి కొన్ని ఉదాహరణలు. ఎయిడ్స్ సోకిన రోగి శారీరకంగా కంటే, మానసికంగా చిత్రహింసలు పడతాడు. వెనకటి ఆదరణా ఆప్యాయత స్థానంలో నిరాదరణ, అసహ్యం చోటు చేసుకుంటాయి. **"వెలివేయొద్దు"** అనే కథలో కీర్తన **'అమ్మా నాన్న , అక్కా అన్నల బంగారు కొండ. గారాల పుత్రిక '** కాలేజీ చదువు అనంతరం పెళ్ళి అయింది. వైవాహిక జీవితం ఆనందంగా గడుస్తోన్న ఒకనాడు ఆమెకు 'ఎయిడ్స్' అని తెలుస్తుంది. ఆమె భర్త అంతటి ప్రేమ చూపే జీవన సహచరుడు నీ దారి నీదే అంటూ కీర్తనను అమ్మ వాళ్ళింట్లో వదిలి వెళ్తాడు. మెట్టినిల్లు కాదన్నా, పుట్టినిల్లు అలా వదుల్చుకోలేదు కద! పులిమీద పుట్ర అన్నట్లు కీర్తనకు తాను నెల దప్పినట్లు అవగతమౌతుంది. అంతా చీకటి అనుకున్న వేళ డా॥ యదునందన్ ట్రీట్‌మెంటు ఆమెకు మళ్ళీ ప్రాణం పోస్తుంది.

ఈ కథలో కీర్తన గతం, వర్తమానం, తులనాత్మకంగా పోల్చబడుతూ ఎయిడ్స్ పేషెంట్స్‌కు ఆశను కలిగించే కథ. వాళ్ళను నిరాదరణకు గురి చేయొద్దని, వాళ్ళ రోగం కంటే రోగం పట్ల భయంతో సగం చస్తారని చెబుతుందీ కథ. అసాంతము, కరుణరసంతో సాగు ఈ కథ సామాన్యులకు ఎయిడ్స్ రోగుల పట్ల కలిగే ఏహ్యతను దూరం చేస్తుంది.

"పండగలనేవి రొటీన్‌గా సాగిపోయే జీవితాలలో మనో వికాసం కోసం సాంప్రదాయాల పేరిట ఏర్పరుచుకున్న సరదాలు. అంతేకాని ప్రాణాల్ని ఫణంగా పెట్టి పండ గల్ని చేసుకోమన లేదు మన పూర్వీకులు అంటారీ రచయిత్రి **'పండగ'** కథలో. ప్రాణం కంటే పండగలు జరుపు కోవ టం ముఖ్యం కాదని, మొదట తన అరోగ్యం తన బిడ్డ ప్రసవం అదీను, సుఖ ప్రసవం ముఖ్యమని చెబుతుంది. ఈ కథలో నెలలు నిండిన చుక్క, అత్తవా రింటి 'పండగ' ఆచారంతో బలియై పోవటం అమానుషం అని తీర్మానిస్తారు రచయిత్రి. అవకరంతో పుట్ట టం ఆ బాబు తప్పు కాదు. చేయని తప్పుకు అవకరంతో పుట్టిన బాబును నిరాదరణకు గురి చేసి, పసి మనసులని గాయ పరచవద్దని, చేయని నేరానికి బాబుకు శిక్ష వేయవద్దని **"నేరం శిక్ష"** కథ చెబుతుంది. వైద్య శాస్త్రంలో **"స్టెమ్‌సెల్"** (బొడ్డుతాడు కణాలు) ఉపయోగించి ఎన్నో ప్రాణాం తకర మైన ఆల్జిమర్స్, మయోపతి లాంటి వాటిని కుదుర్చుకోగలము అన్న విషయాన్ని చెబు తారు **'అమృతం'** కథలో.

పెళ్ళయిన సంవత్సరంలో మూడు తల లుండకూడదు. అన్న నానుడి కొత్తగా పెళ్ళయిన దంపతులు. కనీసం ఏడాది పాటైనా ఎంజాయ్ చేయటానికి కల్పించబడిందని. అంతేగాని గర్భం వస్తే తీయించు కోమన్న పెద్దల ఒత్తిడి మూఢ విశ్వాసం అని కొట్టి పారేస్తారు రచయిత్రి **'అభార్షన్ల పర్వం'** కథలో. అదే కథలో అపుత్రస్య గతిర్నాస్తి అన్న పాతనానుడి ఎంతటి అమాన వీయమైనదో తెలియచేస్తారు. లోగడ వ్రాసిన కథలే అయినా, విజ్ఞాన దాయకంగా ఉన్నాయి. కథలన్నింటా జయప్రదగారు ఒక డాక్టర్ గా, సామాన్య జనానికి తెలియని వైద్య శాస్త్రం లోని విజ్ఞానాన్ని తెలియచెప్పటం బావుంది.

14 కథలు అన్నీ, బ్రాకెటు కట్టి మంచి విషయాలు వివరించటం బావుంది. అభినందనలు. ప్రతుల్ని ఉచితంగా పంచుతూ డాక్టరు గారు సమాజానికి చేస్తున్న సేవ వెలకట్టలేనిది.



**-కూర చిదంబరం**
సెల్: 8639338675

## పరాయి గడ్డపై తొలి అడుగు

మాతృభూమి
మట్టిని ముద్దాడిన పాదాలు
ఇంకో దేశపు నేలను
తాకబోతున్న వేళ
మనసు పొరల్లో
వింతైన ఉద్వేగాల వాన.
సోనాలి సరిహద్దు వద్ద
నిలబడి చూస్తే
ఒకవైపు నా జన్మభూమి భారత్,
మరోవైపు నేపాల్ !
ఇరు దేశాల మధ్య
జైలు ప్రహరీలా
గాజు పెంకులు గుచ్చిన ఎత్తయిన గోడ,
ఎక్కుపెట్టిన తుపాకీలతో
సైనిక పహారా
ఉంటుందేమో అనుకున్నా..!
ఊహూ?
రైల్వే క్రాసింగ్ గేటులా ఓ ఫెన్సింగ్,
ఒకరిద్దరు చెకింగ్ అధికారులు మాత్రమే..!
అచ్చంగా
ఒక్క పంట పొలాన్ని
ఇద్దరన్నదమ్ములు పంచుకున్నట్టే.
ఇక్కడా అదే చీకటి?
అదే సూరీడు? అదే వెన్నెల?
అవే పక్షులు?!
అయితే?
ఓ మారు వెనక్కి తిరిగి చూస్తే
అమ్మా, చెల్లె, పిల్లలు, ఇల్లు?
నాదైన సమస్తం
నా నుంచి
జారిపోయినట్టే అనిపించింది.
పుట్టి పెరిగిన మట్టిని వదిలి
పరాయి గడ్డపై
అడుగుపెట్టిన ఆ క్షణం
పుట్టింటి గడప దాటి
కొత్త జీవితంలోకి వెళ్తున్న
ఆడపిల్ల భావోద్వేగంలా ఉంది..!
"మావాడు యూఎస్?
మా బేబీ యూకే?" అంటూ
బడాయిలు పోయే మిత్రుల మాటలు
ఒకప్పుడు చిన్నబుచ్చేవి
ఇప్పుడు
ఏదైతేనేం?
ఓ విదేశంలో అడుగుపెట్టి
ఆ ఇచ్చా తీర్చుకున్నాను.!
అయినా..
ఎంత అందమైన విదేశమైనా
మాతృభూమి మట్టికి
సాటి ఏముంటుంది!?
ఎన్ని కొత్త దారులైనా
నిండా మన జ్ఞాపకాలే?!
సోనాలి సరిహద్దు?
కేవలం రెండు దేశాల మధ్య గీత కాదు,
నాకు మాత్రం
అన్వేషణ, ఆశ్చర్యం, ఆనందం, ఆవేదన
అన్నీ ఒకేసారి కలిసిన
జీవితపు అద్భుత క్షణం..!



**-నాంపల్లి సుజాత**
9848059893

## నానీలు

బొంబాయి బస్సు
మనుషులతో పాటు
రోజూ కన్నీటి నదుల్ని
మోసుకొస్తుంది
-పత్తిపాక మోహన్

పచ్చని పల్లె జీవితం
పాలిపోతుంది
చేలన్నీ
చేపల చెరువైనందుకు
-సాయి వెంకన్నబాబు

## నానీలు

ఉక్కు కౌగిలికి
ఆహ్వానం పలుకుతూ
ప్రపంచీకరణ
బహుపరాక్
-పి.లక్ష్మణరావు

మరో బ్యాంకు
బోర్డు తిప్పేసిందా?
మరి అత్యాశేగా
కొంప ముంచింది.
- డా॥సి.భవానీ దేవి.

# రంగమేదైనా కృషితోనే గుర్తింపు!

మనిషి ఈ భూమిపై జన్మించిన క్షణం నుండి ఏదో ఒకటి సాధించాలనే తపన అతని అంతర్గత ప్రేరణగా నిలుస్తుంది. ఆ ఆశయమే తన జీవన ప్రయాణానికి దిక్సూచి కాగా, దానిని గమ్యానికి చేర్చే పడవనే 'కృషి'. 'రంగమేదైనా కృషితోనే గుర్తింపు!' ఇది కేవలం నినాదం కాదు, ప్రతి ఒక్కరి జీవితాశయంల సారాంశం. ఏ గెలుపుకైనా ఇదే ప్రాథమిక సూత్రం.

### రంగం కాదు, ఆశయం ముఖ్యం!

చాలామంది ఎంచుకున్న రంగాన్ని బట్టి పేరు వస్తుందనుకుంటారు. చిన్నా పెద్దా అనేదీ రంగాన్ని బట్టి ఉండదు, మనం చేసే కృషి గుణ గణాల్లో ఉంటుంది. కానీ నిజానికి రంగం ఎంపిక కన్నా ఆశయం ఎంపికనే జీవితం. గుర్తింపుని నిర్ణయించేది ఆ రంగం గొప్పతనం కాదు, ఆ రంగంలో మనిషి చేసిన కృషిలోని గుణం, నిజాయితీ మరియు స్థిరత్వం. ఒక కార్మికుడు తన పనిని కళగా మలిచినప్పుడు, ఒక ఉపాధ్యాయుడు విద్యార్థిని సమాజానికి ఒక దిక్సూచిగా, భవిష్యత్తుగా భావించి తీర్చిదిద్దినప్పుడు, ఆ రంగాలన్నీ మహత్తరమైనవే. అందుకే ఎంచుకున్న రంగంలో ఆశయాన్ని ఎంతవరకు నింపగ లుగుతున్నామ నేదే అసలైన ప్రశ్న. గొప్పతనం పనిలో ఉండదు, ఆ పనిని నెరవేర్చిన మనిషిలో ఉంటుంది.

### ఆశయం- జీవన గమ్యానికి నమూనా

ఆశయం అనేది కేవలం కల కాదు, ఒక మానసిక నమూనా. వ్యక్తిగత ఎదుగుదలకు, అవసరమైన సమాజ పురోగతికి ఉపయోగపడాలనే సంకల్పం. కొందరికి విజ్ఞాన శాస్త్రంలో గొప్ప ఆవిష్కరణలు చేయాలని, మరి కొందరికి కళారంగంలో శిఖరాలను అధిరోహించాలని, ఇంకొందరికి సమాజ సేవ చేయాలని ఉంటుంది. ఎంచుకున్న రంగం ఏదైనా, ఆ ఆశయం ఎంత గొప్పదైనా, అది కేవలం ఒక సంకల్పం (intention) మాత్రమే. దానికి రూపం ఇవ్వాలంటే, తగిన కార్యాచరణ (action) అవసరం. ఈ కార్యాచరణే కృషి.

> ఇది కేవలం నినాదం కాదు, ప్రతి ఒక్కరి జీవితాశయంల సారాంశం. ఏ గెలుపుకైనా ఇదే ప్రాథమిక సూత్రం

### కృషి - ఆశయ సాధనకు తపస్సు

కృషి అనేది మనిషి తన జీవితానికి అర్థాన్ని మరియు వ్యక్తిత్వాన్ని జోడించుకునే సృజనాత్మక ప్రక్రియ. సృష్టిలో ఏ విజయమైనా కృషి (శ్రమ) లేకుండా సిద్ధించదనేది నగ్న సత్యం. ఇది కేవలం శారీరక శ్రమ మాత్రమే కాదు, మానసిక ఏకాగ్రతతో కూడిన నిరంతర అభ్యాసం. ఓర్పు, పట్టుదల మరియు త్యాగం కలగలిసిన ఒక నిరంతర ప్రక్రియ. ఒక వైద్యుడు మంచి నైపుణ్యం సాధించాలన్నా, ఒక క్రీడాకారుడు పతకం గెలవాలన్నా, ఒక శాస్త్రవేత్త తన సరికొత్త సిద్ధాంతాన్ని నిరూపించాలన్నా, నిరంతర సాధన అవసరం. వైఫల్యాలు ఎదురైనప్పుడు వెనుకడుగు వేయకుండా, లోపాలను సవరించుకుంటూ, మరింత నాణ్యతను పెంపొందించుకుంటూ, నిలకడగా ముందుకెళ్లడమే నిజమైన కృషి. నిరంతర కృషి మనిషి మనస్సులోని అలసత్వం, అహంకారం వంటి లోపాలను తొలగిస్తుంది. ఒక శిల్పి రాయిని చెక్కి శిల్పంగా మార్చినట్లు, కృషి అనేది మనిషిలోని అంతర్గత సామర్థ్యాన్ని వెలికి తీసి, అతని వ్యక్తిత్వాన్ని మెరుగుపరుస్తుంది. మనిషి స్వయం శిల్పిగా మారే ప్రక్రియ. ఇదే ఆత్మ శుద్ధి.

### గుర్తింపు - కృషికి అలంకరించే కిరీటం!

ఆశయం ఒక సైద్ధాంతిక నమూనా అయితే, దానికి భౌతిక రూపం ఇచ్చే ఏకైక సాధనం కృషి. ఆ కృషితోనే గుర్తింపు. గుర్తింపు అనేది కేవలం పదవులు, పురస్కారాలు మాత్రమే కాదు. అది అంతకంటే లోతైన, గాఢమైన విలువల ప్రామాణికం. ఒక ప్రత్యేక ప్రత్యేకత! అత్యున్నతమైన ఆదరణకు అద్దం పట్టే పట్టా! ఒక వ్యక్తి నిస్వార్థంగా లేదా అసాధారణంగా చేసిన కృషికి సమాజం ఇచ్చే గౌరవం.

తను ఎన్నుకున్న రంగంలో ప్రదర్శించిన ప్రతిభకు మరియు నైతికతతో కూడిన కృషికి దక్కిన ధ్రువీకరణ. రంగం ఏదైనా, కృషి మనిషిని సార్థకత వైపు నడిపిస్తుంది. జీవితంలో ఏదో ఒక ఉన్నతమైన పనిని చేశామనే సంతృప్తిని అందిస్తుంది. ఇతరులు ఇచ్చే గుర్తింపు కంటే, తన కృషి ద్వారా మనిషి తనను తాను నిజాయితీగా నిర్వచించు కోవడమే అత్యున్నతమైన గుర్తింపు. నీవు చేసిన పని నిన్ను మార్చితే, అది కృషి; ఇతరులను మార్చితే, అది గుర్తింపు!

> మనిషి జీవితయానం ఒక పవిత్ర యాత్ర. ఆశయం గమ్యం అయితే, కృషి ఆ ప్రయాణానికి (యాత్రకు) అవసరమైన ఇంధనం

### కర్మ ఫలం

మనిషి ఎంచుకున్న రంగం కేవలం ఒక వేదిక మాత్రమే. అది సంగీతం కావచ్చు, వ్యవసాయం కావచ్చు, లేదా సాఫ్ట్వేర్ కావచ్చు. వేదిక ఏదైనా, దానిపై మనిషి పోషించే పాత్ర యొక్క గొప్పదనం నటన (కృషి) పైనే ఆధారపడి ఉంటుంది. ఇది కర్మ సిద్ధాంతాన్ని బలపరుస్తుంది.

భగవద్గీతలో చెప్పినట్లుగా, మనిషి తన కర్తవ్యాన్ని (ఆశయ సాధనకై చేసే కృషిని) అంకిత భావంతో నిర్వర్తించినప్పుడు, ఫలితం దానంతటదే లభిస్తుంది.


"చేయబోయే పని మీదే మీకు అధికారం ఉంది, దాని ఫలితంపై లేదు!"

మనిషి చేయగలిగింది కృషి మాత్రమే. ఆ కృషి ఫలితంగా లభించే గుర్తింపు (లేదా విజ యం) అనేది దాని ఉప ఉత్పత్తి (by-product) మాత్రమే. కేవలం ఫలితాన్ని ఆశించి కృషి చేస్తే మిగిలేది నిరాశే! గుర్తింపు కోసం కృషి చేయడం కన్నా, కృషినే జీవన వ్రతంగా మార్చుకుంటే, గుర్తింపు వెతుక్కుంటూ వస్తుంది.

### కృషి ఒక్కటే గుర్తింపుకు తాళం చెవి!

మనిషి జీవిత యానం ఒక పవిత్ర యాత్ర. ఆశయం గమ్యం అయితే, కృషి ఆ ప్రయాణానికి (యాత్రకు) అవసరమైన ఇంధనం.

రంగం ఏదైనా, తపస్సులా చేసే 'కృషి'తోనే జీవితానికి 'గుర్తింపు' అనే సార్థకత లభిస్తుంది. అందుకే, మనిషి తను ఎంచుకున్న రంగంలో గొప్పవాడిగా నిలవ డానికి, చిరస్మరణీయమైన జీవితాన్ని గడప డానికి కృషి ఒక్కటే అత్యంత శక్తివంతమైన తాళం చెవి!



**-ఆచార్య కడారు వీరారెడ్డి**
9392447007

## నానీలు

నగరం చుట్టూ
ప్లాట్ల సమాధులు
బతికున్నంగనే
బక్క రైతు శవాలు.
-కోట్ల వెంకటేశ్వర రెడ్డి

ఫ్యాషన్-ఫ్యాక్షన్
రెండూ రెండే
అంగాల్ని చూపడం
అంగాల్ని వేరు చేయడం
-కె.జె.రమేశ్

## నానీలు

మట్టి పాత్రలు
మాయమైనవి
కుమ్మరి వామి
కూలిపోయింది!

వానొస్తే వలవల
గాలొస్తే గలగల
ఆరు తడి పంట
రైతుకు తంట.
-ఎం.ఎ.గఫార్
సెల్: 9490324834




నిర్వహణ
-కందుకూరి శ్రీరాములు
-బెల్లంకొండ సంపత్ కుమార్

తెలంగాణ రచయితల సంఘం జంట నగరాల శాఖ
ప్రతి వారం 'జూమ్'లో నిర్వహిస్తున్న
"సోమవారం కవిసమ్మేళనం - కవివారం'లో
కవులు పాల్గొని చదివిన కొన్నికవితలను
నేటినిజం పాఠకుల కోసం..
-సంపాదకులు

## తెలుగుజాతి వరం - సురవరం

తెలంగాణ బాటల్లో
అక్షరాల కోటగా నిలిచినవాడు
తెలుగుదనపు నిండుతనం
తెలంగాణ ఆత్మగౌరవ స్వరూపం
సాహితీ సౌరభం ? సురవరం
"తెలంగాణలో కవులు లేరు" అన్న
వివక్షా చూపులకు
గోల్కొండ కవుల సంచికతో
దీటుగా జవాబు చెప్పిన ధీశాలి
వరుస కట్టిన కవుల కాంతులతో
తెలంగాణ కవితాగీతికలను వెలిగించి
హద్దులు దాటిన అవమానాలకు
కలంతో కళ్లెం వేసిన ధర్మావేశం.
రజాకార్ల పెత్తనంపై
మర్లబడ్డ పౌరుషాన్ని మేల్కొలిపి
అణచివేతలపై విరుచుకుపడిన
అక్షర కెరటమై ఎగిసిన జ్వాల
నిజామును ఎదిరించి
నవాబుగిరిని ఎండగట్టిన
ప్రజాగొంతుక 'గోల్కొండ' పత్రిక
స్వేచ్ఛకు శబ్దశంఖారావం
గోల్కొండ పత్రిక ఆగినా
'ప్రజావాణి'గా పలికిన ప్రతాపుడు.
పలు భాషల్లో పాండిత్యం పొంది
సాహిత్య శిఖరంగా నిలిచిన మహనీయుడు
'ఆంధ్రుల సాంఘిక చరిత్ర'
చరిత్రనే సృష్టించిన గ్రంథం
కేంద్ర సాహిత్య అకాడమీ గౌరవం పొందిన
తెలుగు జాతి సామూహిక స్మృతి
'హిందువుల పండుగలు'
'రామాయణ విశేషాలు' వంటి కృతులు
ఆయన కీర్తికిరీటంలో
కలికితురాయిలై మెరిశాయి
గ్రాంథికమూ వ్యవహారికమూ
సమయానుకూలంగా సంధించిన సవ్యసాచి
స్వభాషాభిమానం ఆయన శ్వాస
సామాజిక చైతన్యం ఆయన దిశ
తెలంగాణ అభ్యుదయం ఆయన భావం
నాయకత్వం ఆయన నడవడి
న్యాయశాస్త్ర పాండిత్యం
పత్రికారంగ ప్రవీణత
సాహిత్యానికి వన్నెలద్దిన
పరిశోధకుడు? పరిశీలకుడు?
విమర్శకుడు? వివేచనుడు?
'సురవరం ప్రతాపరెడ్డి తెలుగు యూనివర్సిటీ'
తెలుగు భాషా సంస్కృతులకు
శాశ్వత వెలుగుకాగడా
ప్రతాపరెడ్డి అంటే పేరు కాదు
విశిష్ట రచనల విజ్ఞానగని
తెలుగు జాతి గర్వకారణం
తెలుగుజాతికి లభించిన వరం?
(మే 28 సురవరం ప్రతాపరెడ్డి జయంతి)

-గడ్డం సులోచన
7702891559.

## నేటి తీరు

(వచన కవిత)

దెయ్యాలు వేదాలు
వల్లిస్తున్నాయి
జాతుల రాతలు మార్చాలని.
నిజాలు నిప్పులో
మాడిపోతున్నాయి నిర్వీర్యమై
నీతులు నేతల చేతుల్లో నలిగి
జనులకు వాతలు పెడుతున్నాయి.
మౌనమే అంగీకారమై
మాటల చేతల్లో
నిర్భాగ్యుల జీవితాలు నలుగుచున్నాయి.
ఓటు నోటు చేతిలో చిక్కి
గెలుపోటములు నిర్ణయిస్తున్నాయి
బలాబలాల లెక్కలు
బజార్లో నిలబడి బరితెగిస్తున్నాయి.
గుంపులు విభజింపబడుచు
కూటములు లెక్కల్లో మునిగిపోయి
నిజాయితీపరుల గుండెల్లో
గునపాలై గుచ్చుకుంటున్నాయి.
వాపును చూచి బలమనుకొని
నచ్చని సిద్ధాంతాలను జనంపై
రుద్దుతున్నాయి
మేధావుల్లారా మేల్కొనండి
ధర్మాన్ని రక్షించండి.

-నర్సింగోజు లక్ష్మయ్య
9866152371

## ఒక కల కోసం

కాలంతో పాటు సమాజం కూడా మారింది
అప్పుడు సూర్యుడు నిద్రలేవకముందే
ఇంట్లో పొయ్యిలు నిద్రలేచేవి
వాకిట్లో ముగ్గులు అప్పుడే విచ్చుకున్న
మొగ్గల్లాగా
ఎంతో అందంగుండేవి
కాని ఇప్పుడు సూర్యుడు నిద్రలేచినంక కూడా
పొయ్యిలు నిద్రలేవడం లేదు
వాకిట్లో ముగ్గులు
వాడిపోయిన మొగ్గలుగా కానొస్తున్నయి.
అప్పుడు తెల్లారిందంటే
ఊళ్లోవారంతా వాకిట్లో కళ్ళాపిచల్లుతూ
సూర్యుడిని దర్శనం చేసుకునేవారు
కాని ఇప్పుడేమో
సూర్యుడి దర్శనం కన్నా ముందే
ఫోన్లను దర్శనం చేసుకుంటున్నరు.
ఒకప్పుడు సాయంత్రమైందంటే
అరుబైట ముచ్చట్ల సంతుండేది
ఒకరి కష్టసుఖాలు ఒకరు పంచుకునేటోళ్ళు
కానీ ఇప్పుడు అందరి కండ్లు ఆ దిక్కుమాలిన
సీరియల్స్ లోనే ఉంటున్నవి.
అప్పుడు ఏ చిన్న గొడవైనా
మనవారనే మమకారంతో
ఆపడానికి పదిమంది వచ్చేవారు
కాని ఇప్పుడు మాటా మాటా పెరిగి
గల్లలు పట్టుకొని యుద్ధానికి సిద్ధమైనా
అందరికీ పరాయి భావనే.
అప్పుడు ఆసుపత్రులంటే
ప్రాణాలు నిలబెట్టే ఆలయాలుగా ఉండేవి
కాని ఇప్పుడు పైసలు వసూలుచేసే
ఫైనాన్సులయ్యాయి
అప్పుడు ఊరిలోనే పైసా లేకుండా
న్యాయంగా తీర్పులొచ్చేవి
కాని ఇప్పుడు న్యాయం
అన్యాయంగా పేదవాడికి దూరమవుతుంది.
డబ్బుకంటే
మనుషులకు విలువనిచ్చే రోజులు రావాలి
మనుషులతో మనుషులు
ప్రత్యక్షంగా మాట్లాడుకునే రోజులు రావాలి
అందరి ముఖాలు
నవ్వులతోటలై వెల్లివిరిసే రోజులు రావాలి
ప్రపంచమంతా పచ్చని ప్రకృతి ఒడిలో
ప్రశాంతంగా నిద్రలేచే రోజులు మళ్లీ రావాలి
ఆ కల కోసమే నా కలం

- పద్మ భవ్యశ్రీ

## నేను చూశాను

నేను చూశాను
పొద్దు పొద్దున్నే వచ్చే సూర్యుడి తొలి కిరణం
అది అమ్మ ఒడి పంచే వెచ్చని పులకరింపు
మళ్ళీ అదే సూర్యుడు మధ్యాహ్నం
నిప్పులు కక్కడం చూశాను
అది ఆకలితో అలమటించే పిల్లలను చూసి
తండ్రి కళ్లలోంచి వచ్చే ఆవేదనలాంటి వేడి.
నేను చూశాను
కోట్ల ఆస్తులున్నా మనశ్శాంతి లేని మేడలను
అవి అలంకరించిన శవవాహనంలా
నిశ్శబ్దంగా ఉన్నాయి
తిండికి గతి లేకపోయినా
ప్రేమగా పంచుకొని తినే పేద గుడిసెలను
చూశాను
అవి పేదరికంలో కూడా వెలిగే వెన్నెల
దీప్పాల్లా ఉన్నాయి.
నేను చూశాను
పుట్టిన బిడ్డను చూసి మురిసిపోయే
తల్లి కళ్లలోని ఆనంద కన్నీరును
అవి ఆకాశం నుంచి రాలిన నక్షత్రాల్లా
మెరిసిపోతున్నాయి
అనాథాశ్రమంలో తోడెవరూ లేక
రాలే వృద్ధుడి కన్నీటిని చూశాను
అవి సముద్రపు లోతుల్లో దాగున్న
పగడాల్లాలా
ఎరుపుగా ఉన్నాయి.
నేను చూశాను
నిన్నటి మొగ్గ నేడు వికసించి పరిమళాన్ని
పంచడం
రేపటికి అది రాలిపోయి
మట్టిలో కలిసిపోవడం
జీవితం అంటే కేవలం శ్వాస తీసుకోవడం
కాదు
ప్రతి క్షణం ఏదో ఒకటి నేర్చుకుంటూ ఉ
ండటం అని
నేను గ్రహించాను
అప్పుడప్పుడైనా
ప్రపంచాన్ని కళ్లతో మాత్రమే కాదు
హృదయంతో చూడాలి

-ఎమ్.పూజిత

## టీ

సమస్త లోకములతో టీ
సర్వజనులతో టీ
నీరాజనాలందుకుని తాగే టీ
విరాజాయ విజయం తో టీ
ఉదయాన్ని పలకరించే టీ
నలుగురు కలిసిన ముచ్చట్లతో టీ
పొద్దు పొద్దున్నే సేవించే టీ
కష్ట సుఖాలను చెప్పుకునే టి
అనురాగ సంతోషాలతో టీ
ఆవురావురుమని సేవించే టి
ఎల్లవేళలా పలకరించే టీ
మనసుకు ఉత్సాహాన్నిచ్చే టీ
కొత్తవారిని పరిచయం చేసే టీ
స్వర్గలోక మధుపానంతో పో టీ
అలసట పోగొట్టే టీ
పైనుండి తొంగి చూసే టీ
ఉదయ కిరణమొక టీ
పొయ్యిమీద మసిలే టీ
గుమ గుమల కమ్మ టీ
రుచిచూసి ఆశీర్వదించు రేపటి
స్వాగతాల నవోదయ వెరై టీ !
(మే 21, అంతర్జాతీయ టీ దినోత్సవం)

- పట్లోళ్ళబక్కారెడ్డి
9705315250

## ఏదో ఒకరోజు

జీవిత ప్రయాణం
సముద్రంలో నౌకా ప్రయాణం లాంటిది
ఎన్నో అలలు నౌకను తాకినట్టు
మన జీవితంలో కూడా ఎన్నో కష్టాలు
మనకు స్వాగత గీతం పాడతాయి
అలలను జయిస్తేనే నౌక ఒడ్డుకు
కష్టాలను జయిస్తేనే జీవితం కడవరకు.
కష్టం వచ్చిందని కన్నీళ్లు కార్చుతూ
పిరికితనపు ముసుగులో దాక్కుంటావో
ధైర్య సాహసాలతో ముందడుగు వేస్తావో
నీ ఇష్టం
జీవితం ఎప్పుడూ ఒకేలా ఉండదు
అలా ఉంటే అసలు అది జీవితమే కాదు
మనం ఓ దారిలో ప్రయాణిస్తున్నప్పుడు
ఎన్నో ఎత్తు వంపులు రాళ్లూ,ముళ్ళు
ఎదురవుతాయి
అలాంటిది ఇదొక జీవిత ప్రయాణం
ఇంకెన్నెన్నో ఆటంకాలు నీకెదురవుతాయి
అక్కడే ఆగుతావో నీ గమ్యానికై ప్రయాణం
సాగిస్తావో
అది నీ నిర్ణయంపై ఆధారపడి ఉంటుంది
బాధలో ఉన్నప్పుడు నిర్ణయాలు తీసుకోకు
అవి నీకు బాధనే మిగుల్చుతాయి
నువ్వెందుకు ఓడిపోవు అని
కాలాన్ని ఓ సారి ప్రశ్నించు
నేను ఎలాంటి కఠినమైన పరిస్థితి వచ్చినా
నడుస్తూనే ఉంటానని సమాధానమిస్తుంది
నువ్వు కూడా కాలంతో నడిచి చూడు
ఏదో ఒక రోజు నిన్ను విజయం తప్పక
వరిస్తుంది

- కుమ్మరి అక్షయ

## అభ్యసించాల్సిన ఆదర్శ పాఠం

మగువల మృదుఎదలోని మనోవేదన
తమ కళ్ళ నుండి కట్టలు తెంచుకున్నా
కన్నీటి ధారలై
మాధుర్యాలను కురిపించే
చిరునవ్వులు కరువు కాగా
ఎడబాసిన బుగ్గల ఎరుపు.
తమ జీవన సంద్రంలోని అడ్డంకుల అలలు
ఎప్పుడు ఏ సమస్యల తుఫానులను
రేగెత్తిస్తాయో అని
స్వీయహృదయాన్ని వెంటాడిన ప్రశ్నలు.
క్షణక్షణం కంటి రెప్ప దిగువలో
కదలాడే కష్టాలు
హృదయతార ఆనంద మెరుపులేక
స్వేచ్ఛ తళుకులకు తనతో చెలిమికి
తావు లేక మూగబోయిన పలకరింపులు.
తనకు నలుగురిలో లభించిన సంపద
తన మంచితనపు ప్రభావం
నాలుగు గోడల మధ్య స్వజనుల సన్నిధిలో
తమ గౌరవమకుటం విరిగి ముక్కలై
కృష్ణబిలం చీకట్లోకి పడడం
ఇప్పటికీ వేదిస్తోంది.
తమ జీవనజ్యోతిని వెలిగించే విద్యకు
ఇప్పటికీ దూరమౌతున్న స్త్రీలెందరో
తన స్వావలంబన
భువికి చేరని చినుకయ్యింది
అయినా వనిత జీవితపు సహనం
లోకం అభ్యసించాల్సిన ఆదర్శ పాఠమైంది

-యం.స్పందన

## ఎలుగుబంటి సాయం (కథ)

సుందరవనమనే అడవిలో మర్కటం అనే ఒక కోతి ఉండేది. అది తుంటరి పనులు చేయడమే కాకుండా అన్ని జంతు వుల పట్ల నిర్దయగా ఉండేది.


ఒకసారి అది ఒక జింక పిల్లపైన ఎక్కి కూర్చుని దానిని పరిగెత్తమంది. ఆ కోతి చాలా బరువుగా, పెద్దగా ఉండడం వల్ల ఆ జింకపిల్ల పరిగెత్త లేకపోయింది. అప్పుడు జింక పిల్ల "కోతి మామా! నా కాలుకు గాయమైంది. నేను ప్రస్తుతం పరిగెత్తడం మాట అటుంచి కనీసం నడవ డమే ఇబ్బం దిగా ఉంది. దయచేసి నాపై నుండి దిగు . నా కాలు బాగు అయిన తర్వాత నీవన్నట్లే నేను నిన్ను ఎక్కించుకొని పరిగెత్తుతాను "అని అంది. కానీ కోతి దాని మాటలు వినక "నీవు పరిగెత్తకుంటే నేను నిన్ను ముళ్ళ కర్రతో కొడతాను. ఊ.... పరిగెత్తు" అని అంది .

అప్పుడే ఈ మాటలు విని అక్కడికి వచ్చిన ఎలుగుబంటి "ఓ కోతీ! ఆ జింకపిల్ల పై నుండి కిందికి దిగు. దాని కాలికి గాయ మైంది . దానికి నేనే వైద్యం చేస్తున్నాను. అది ఇప్పుడు నడవలేదు" అని అంది . అయినా ఆ కోతి దాని పైనుండి దిగలేదు.

అప్పుడు ఎలుగుబంటి ఒక చిరుత పులి అటువైపు రావడం గమనించి " ఓ చిరుతా! ఇటు వైపు రా !ఈ కోతి పని పట్టు !"అని అంది . వెంటనే చిరుత ఆ కోతి వైపు పరిగెత్తుకుంటూ వచ్చింది. కోతి దాని భయానికి జింకపై నుండి దూకి పరిగెత్తి మాయమైంది.

అప్పుడు జింక "అయ్యో ! ఎలుగు మామా! ఒక ఆపద నుండి గట్టెక్కినానని అనుకుంటే ఈ చిరుత రూపంలో మరో ఆపదను నాకు తెప్పించావు. దీనికన్నా అదే నయం. ఇది నన్ను చంపకమానదు" అని భయపడుతూ అంది.

అప్పుడు ఎలుగుబంటి నవ్వి దాని చెవిలో " ఓ బుజ్జీ! నువ్వు భయపడకు . ఇది నా




నేస్తం.

ఇది నన్ను కలుసుకోవడానికి వచ్చింది. ఇది మనలను ఏమి చేయదు . అంతే కాకుండా నా వద్దకు చికిత్స కొరకు వచ్చిన వారికి హాని తలపెట్టవద్దని మృగరాజు ఈ క్రూర మృగాలను ఆదేశించిన సంగతి నీకు తెలియదు. తుంటరి కోతి లాంటి ప్రాణుల భరతం పట్టడానికి దీన్ని నేను ఇటు పిలిచాను. నువ్వు నిశ్చింతగా ఉండు" అని అంది . చిరుత పులి ఎలుగుబంటి కి మళ్ళీ కలుస్తానని చెప్పి వెళ్ళిపోయింది. జింకపిల్ల తనకు ఆపదలను తప్పించి వైద్యం చేస్తున్న ఎలుగుబంటి సాయాన్ని మిక్కిలి ప్రశంసించింది.



-సంగనభట్ల చిన్న రామకిష్టయ్య,
9908554535

# మహాకవి గుంటూరు శేషేంద్ర శర్మ ప్రతీకాత్మక కావ్యం "గొర్రిల్లా"




ఆధునిక మహాభారతంలోని
'పశుపర్వం'కు
స్వర్ణోత్సవ సంవత్సరం.
( 976-2026)
(మే 30 శేషేంద్ర 19వ వర్ధంతి సందర్భంగా...)

ఆధునిక తెలుగు కవిత్వ సీమలో మేరు నగధీరుడు గుం టూరు శేషేంద్ర శర్మ. వారు వ్రాసిన రచనలు కవితా ప్రియులకు పసందైన కావ్యాలు. కవిత్వం కావాలి అని వెతుక్కునే కవితా హృదయాలకు రసరమ్య కావ్య గుళికలు! కవి తన రచన సమాజ హితం కోసం రాస్తాడు. శేషేంద్ర రచనలు సమాజ హితం కోసం రాసినవే! భారత దేశ చరిత్రలో ఇందిరా గాంధీ ప్రధానమంత్రి గా ఉన్న కాలంలో 1975-1977 కాలం ఎమర్జెన్సీ అత్యంత కష్టమైన కాలం. అది ఒక చీకటి అధ్యాయం, అవి చీకటి రోజులు అనబడిన కాలము. అలాంటి ఎమర్జెన్సీ కి వ్యతిరేకంగా వ్రాయబడిన కవితా ఖండికల కావ్యమే 'గొర్రిల్లా'! ఇందులో ఉన్న కవితలు అన్నీ ( 1975-1976 ) లలో అప్పటి వివిధ తెలుగు దిన, మాస పత్రికలలో ప్రచురింప బడినవి. ఆకాశవాణి కవి సమ్మేళనంలలో , ఇతర కవి సమ్మేళనాల్లో శేషేంద్ర ఈ కవితలను చదివాడు. ఇలాంటి కావ్యం వ్రాసినం దుకు ఎమర్జెన్సీ కాలం లోనే ప్రభుత్వ ఉద్యోగి అయిన శేషేంద్రను నిర్బంధ పదవీ విరమణకు ( compulsory retirement ) కు గురి చేసింది అప్పటి ప్రభుత్వం . శేషేంద్ర 'గొర్రిల్లా' కావ్యం ఇలా మొదలు అవుతుంది. " రాత్రి నిద్ర కోల్పోయి ఇళ్ళ కప్పుల మీద మొరుగుతోంది. కాలం శిశువులా నిద్రిస్తోంది ఊగుతున్న పెండులం ఉయ్యాలలో - ఇళ్ళన్నీ కళ్ళు మూసుకున్నాయి... వాటి గొంతులన్నీ ఆగిపోయాయి నా గొంతు లేచి బంగారం వినిరేస్తోంది యువమానవ పద్యజ్వాలల్లోకి .. ..,... అవ్యక్త భవిష్యద్వి పినాం తరాల్లో అదిగో లేస్తుంది భయంకర ఆకార రేఖ - గొర్రిల్లా'.'' 'గొర్రిల్లా' భౌతికంగా కోతి లాంటి పెద్ద జంతువు. ఈ కావ్యంలో "గొరిల్లా" ఒక ప్రతీక (symbol). అది అణగారిన మనిషి యొక్క ధర్మ ఆగ్రహం, తిరుగుబాటు, అంతర్మథనం.

సమాజంలోని అణచివేత, రాజకీయ హింస, మానవ అసమానతలపై వ్రాయబడిన ప్రతీకాత్మక కావ్యం. ఈ వ్యాస రచయిత సబ్బని లక్ష్మీనారాయణ, గుంటూరు శేషేంద్ర శర్మ గారిని ఆగస్టు 28, 2004 ఒక నాటి సాయంత్రం ఇంటర్వ్యూ చేయడం జరిగింది శేషేంద్ర బ్రతికి ఉన్నపుడు. ఇంటర్వ్యూ లో చివరగా... మీకు నచ్చిన కొన్ని కవితా వాక్యాలు చెప్పండి అని అడిగితే

**"వ్యవసాయ కూలీల ఆకాశం**
**వర్షాలు కురుస్తుందే కానీ**
**వసంతాలు కురవదు**
**సోదరులారా!**
**ఇప్పుడు రాజకీయం వర్షం పడుతోంది**
**మోసపోయి మీ విత్తనాలు చల్లకండి."**

అని జవాబు చెప్పారు శేషేంద్ర. ఇది మోసపోతున్న బ్రతుకు చిత్రం, మోసపోతున్న రైతు బతుకు చిత్రం అప్పటికీ, ఇప్పటికీ రాజకీయ నాయకుల మోసపూరిత వాగ్దానాల వర్షం కురుస్తున్న కాలం కదా ఇది ! ఈ అద్భుత కవితా వాక్యాలు ఈ "గొర్రిల్లా" కావ్యంలోనివే. శేషేంద్ర కవిత్వం లోని చాలా పాపులర్ అయినా కవితా పంక్తులు "సము ద్రం ఒకడి కాళ్ళ దగ్గర కూర్చుని మొరగదు తుఫాను గొంతు చిత్తం అనడం ఎరగదు

పర్వతం ఎవడికీ వంగి సలాం చెయ్యదు నేనింతా ఒక పిడికెడుమట్టే కావచ్చు కానీ కలమెత్తితే నాకు ఒక దేశపు జెండాకున్నంత పొగరుంది " అని ఆత్మ విశ్వాసంతో ఒక మహాకవి చెప్పిన కవితా వాక్యాలు కూడా ఈ "గొర్రిల్లా" కావ్యం లోనివే! ఇంకా , "మీ 'గొరిల్లా' కావ్య వస్తువుకు ప్రేరణ ఏమిటి? ' అనే ప్రశ్నకు ,

శేషేంద్ర గారు ఇలా జవాబు ఇచ్చారు , "దేశంలో ఉన్న దారిద్ర్యం, అసహాయులుగా చచ్చిపోయే అసంఖ్యాక జనం." అని .

కవుల కవితా పంక్తులు జనులను జాగృతం చేస్తాయి. పవన్ కల్యాణ్ లాంటి ప్రసిద్ధ తెలుగు సినిమా నటుడు ఎన్నో సభల్లో, అశేషమైన జనవాహినిలో శేషేంద్ర గారి ' ఆధునిక మహాభారతం ' లోని ఇలాంటి ఎన్నో కవితా వాక్యాలను ఉటంకిస్తూ ప్రసంగం చేసిన సందర్భాలు ఉన్నాయి.

శేషేంద్ర కవిత్వంలో ఏముంది అంటే మానవ శరీరంలో అణువ ణువున రక్తం ఆవరించి ఉన్నట్లు శేషేంద్ర రచనల్లో అడుగడుగునా సామాజిక స్పృహతో కవిత్వం ఉంటుంది. ఒక సందర్భంలో ఈ పుస్తకంలో ఇలా రాస్తారు శేషేంద్ర.

"ఉషస్సు కళ్ళు తెరిచే సరికి కనిపిస్తాం ఒక గుడ్డిలాంతరు ముందు కూర్చుని పనిచేస్తున్న నేనూ నా కవిత్వపు పనిముట్లూ పిడికిళ్ళ బిగి కెప్పుడూ వాడే లక్ష్యం

వాడి బలిశిన శరీరాన్ని ఆ కుర్చీ చేతులు పట్టుకో ఉన్నాయి గానీ లేకపోతే వాడెప్పుడో భూమ్యాకర్షణశక్తికి బలి కావలసిన వాడు.

నా పిల్లల చేత వాడు నా తిండి తినిపిం చక పోతే భూమిచేత నేను వాడి రక్తం తాగిస్తా

నా కవిత్వం ఏ జెండానూ ఎగరేయదు కానీ

నా చేతులు నా దేశపు ఖడ్గాలు

రా సోదరా, ఇది గొర్రిల్లా యుగం! విస్తట్లో తుఫానులు వడ్డించాను తిందాముురా- మనకోసం నిరీక్షిస్తున్న తరుణపు బ్రహ్మ రాక్షస పరిమాణాలు అందుకుందాం...రా" ఇలా శేషేంద్రది ఆత్మ ప్రబోధ కవిత్వం ప్రజల కొరకు . శేషేంద్ర ఆధునిక మహాభారతం లోని పశు పర్వంలో నాలుగు పర్వాలు ఉ న్నాయి . అందులోని మొదటి పర్వంలోని కవితావాక్యాలె పైన చెప్పినవన్నీ. ఇక రెండో సర్గలో ఇలా చెపుతాడు శేషేంద్ర :

" ఈ దేశపు వీధుల్లో ధీరువులు నడవలేరు-గుండె ఛాతీలోనుంచి ఎక్కడ పారిపోతుందో అని భయపడుతూ ఎలా నడుస్తారు.

అస్తమించనీకుండా అరచేత్తో ఎత్తి పట్టుకో మిత్రమా, నీ గుండెలో మెరిసే నక్షత్రమండలాల్ని - నీ కాళ్ల సంకెళ్లు తెగిపోవాలనీ నీ చేతుల్లో ఖడ్గాలు మెరవాలనీ దీవిస్తున్నాను పద నిర్భయంగా నీ దీపాలన్నీ వెలిగించబడే ఉన్నాయి?..

?సోదరా నీవు గొర్రిల్లా !" ఇది కవి యొక్క ప్రబోధం జనులను జాగృతం చేయడానికి. ఇంకా ఇలా చెపుతారు తన ప్రతీకాత్మకమైన కావ్యం 'గొర్రిల్లా' లోని గొర్రిల్లా గురించి :

"గొర్రిల్లాలో రాక్షసుడు కరుణామయ రాక్షసుడు; అకలుషిత రాక్షసుడు, తనకు మానవతా నిర్మాణశిల్పమే ధ్యేయం తన మార్గానికి ద్రోహులు అడ్డవచ్చినప్పుడే చూపిస్తాడు తన రెండో ముఖం అమలిన హింస! పవిత్రహింస! తమ్ముడా ఇవాళ రాక్షసుడు నన్ను ఆవహించాడు, నీవు పడిపోయిన నపుంసకత్వపు లోతుల్లోనించి నిన్ను ఉద్ధరించడానికి-"

గొర్రిల్లా కావ్య రచన ఉద్దేశ్యాన్ని గురించి తెలియజేస్తాడు. అలా చెపుతూ, " నా కవిత్వం కేవలం మనిషికి డిఫెన్స్ ! " అంటాడు శేషేంద్ర. ఇంకా వ్యవస్థ గురించి , వ్యవస్థ లోని మనుషుల గురించి చెపుతూ, "

"మోపేకాడికి మెడ అంకితమిచ్చే ప్రజలూ రాజకీయ పేజీల్లో పురుగుల్లా నలిగిచచ్చిన మునీశ్వరులూ, కవీశ్వరులూ వుంజీలు పుంజీ లుగా పడి ఉన్నారు- వ్యభిచారులైన దేవుళ్ళను పూజిస్తారు.

నీతిపరులైన మనుషుల్ని చంపుతారు.., నేలను బట్టలా కొలిచి పెట్టెలో పెట్టుకుం టున్నారు మూర్ఖులు అంతిమక్షణం వచ్చిందని తెలీక; దిక్కుల్లో పిక్కటిల్లుతున్న గొర్రిల్లా కేక మీద బధిరత్వం విధించారు.

**"అదిగో ఉదయించే దిక్కు**
**దానికే హృదయపూర్వకంగా మొక్కు !"**

అంటూ జనులకు తన కవిత్వం ద్వారా హితబోధ చేస్తాడు.

కవిగా తన గురించి, తన కవిత్వం గురించి చెపుతూ, "నేను జేబుల్లో కోకిలల్ని వేసుకురాలేదు. పిడికిళ్ళలో బాంబులు బిగించుకుని వచ్చాను.

నా మాటలు ఈ దేశపు మట్టిలో చల్లుతున్నా అన్ని చోట్లా మొలవాలని; నేను జ్వాలల్ని కొరడాలుగా ఝుళిపిస్తున్న అగ్నిని " అని జనులను జాగృతం చేయడానికి తన కవిత్వాన్ని ఒక సాధనంగా చేసుకున్నాడు శేషేంద్ర. ఇక ఆధునిక మహాభారతము

'గొర్రిల్లా' మూడో సర్గలో

**"ఒకనాడు కాలమేఘంలా గర్జించిన ఈ దేశం ఈనాడు మ్యావ్ మంటోంది ఇదేమిటి.. .మళ్ళీ స్వేచ్ఛ ఈ దేశంలో తిండిలేనిదై గడ్డితిని బ్రతుకుతోంది..**

**.. నాగళ్లూ తుపాకులూ పట్టుకునే ఇనుప హస్తాలు నాయకుడి కాళ్లు పట్టుకుంటున్నాయి"**

అని బానిస బుద్ధితో చేవ చచ్చిన జనాల నైజాన్ని గుర్తుకు చేస్తున్నాడు.

ఇంకా " నమ్మండి మనిషి బాధని తొడల మీద వేసుకుని పొట్టచీల్చే రోజు వస్తుంది గొర్రిల్లా ఐ-

మీ చేతులు మీస్వర్గం నిర్మించే శక్తి పొందాలనీ మీ గుండెలు ధైర్యపు కండలు తొడుక్కోవాలనీ మీ దేహాల్లో గొర్రిల్లా మీ మస్తిష్క శిఖరాలకు పెరగాలనీ ఆశీర్వది స్తున్నాను .. పదండి." అంటూ ధైర్య వచ నాలు చెపుతూ జనులను ముందుకు నడిపి స్తాడు మంచిని, దుష్ట శిక్షణను కాంక్షిస్తూ. ఇంకా మనిషికి భరోసాను ఇస్తూ, "నీ శోకాన్ని నాకు దత్తతగా ఇవ్వు తీసుకుంటా" అంటాడు. "ఆయుధశక్తి దాన్ని ధరించే బాహువుల్లో ఉ ంటుంది; హక్కు ఆ దాన్ని అనుభవించే సంకల్పంలో ఉంటుంది-" అని మనిషికి గుర్తుకు చేస్తాడు. శేషేంద్ర కావ్యం గొర్రిల్లా లోని 4 వ సర్గలో"

"ఓ గొర్రిల్లా లే గొర్రిల్లా మనిషిలో నిద్రిస్తున్న ఓ క్రియా శక్తి ఓ మహాత్మా ఓ గొర్రిల్లా నిద్రలే!

నీవు నిదురించడానికి వేళకాదు నీ మహాద్వారం దగ్గర నిల్చుని ఈ పాటలల్లు తున్నా ఈ పాటల జన్మనిన్ను మేల్కొల్పడానికె ఈ పాటలన్నీనీ నిద్రలే గొర్రిల్లా ఓ కర్మయోగి నీ యోగ సమాధిలోనించి బయటికిరా నీవు చేసిన మనిషి వట్టి జ్ఞానయోగిఐ కృశించి నిర్వీర్యుడై పోయాడు.. మానవతా సముద్ధర ణకు సహస్ర బాహువులతో సహస్రాయు ధాలతో." అంటూ మనిషిలోని గొర్రిల్లాను సమాజ శ్రేయస్సు కోసం మేల్కొలపడానికి తన కవిత్వాన్ని ఒక సాధనంగా, ఒక మాటలా, మంత్రంలా ప్రయోగించాడు శేషేంద్ర. ఇంకా,

**"మమ్మల్ని అవహించు ఓ గొర్రిల్లా, నిజాలకు మా భుజాలు జోడించు మమ్మల్ని పవిత్ర హింసాసీమలకు మోసుకుపో నీ రోమరోమాల్లోంచి పుట్టాలి కోటానుకోట్ల కర్మ వీరులు త్యాగవీరులు పతనమౌతున్న ధరిత్రిని పైకెత్తి ప్రాణ ప్రతిష్ఠ చెయ్యాలి."** అని గొర్రిల్లా కావ్య ప్రయోజనం గురించి తెలియ చేస్తున్నాడు శేషేంద్ర.

"మహాపురుషా! నీ దివ్య మంగళ విగ్రహం ఒక్కసారి చూపించు బాలకుడై , నిస్సహాయుడై ఏడుస్తున్నాడు మనిషి దర్శనమివ్వు - -గోపురాలు భుజాన వేసుకొని నూపురాలుగా ఆధునిక రాక్షస కపాలాలు ధరించుకున భయంకర మారణాయుధాలు అలంకరించుకుని వామపాదం కిందికి ప్రత్యాలీఢభంగిమలో నిలిపి దక్షిణపాదం నాయకాసురుడి గుండెల మీద మోపి కుడి పిడికిటో గండ్రగొడ్డలి పూని ఎడమ పిడికిట్లో అధికారి చిన్న మస్తకాన్ని జుట్టుతో గ్రహించి నానా అధర్మజాతుల ధైర్యాస్తమయ ఘోరకారణమైన గ్రీష్మాతవ జ్వాలా మాలిక లాంటి నాలిక నీ ముఖ మండల నిర్దళితమై వేలాడుతుండగా నీ గుడ్లనే అగ్నిగోళాల్ని ఒక్కసారి ఈ కుళ్లిన దేశం మీద విసిరెయ్ 'గొర్రిల్లా' ! 'గొర్రిల్లా' ! 'గొర్రిల్లా' !" అంటూ గొర్రిల్లా విశ్వ రూపాన్ని ఆవాహన చేస్తూ దుష్ట సంహారం చేయాలని గొర్రెల్లాను ఆహ్వానిస్తునాడు శేషేంద్ర.

"నవతరాల పిల్లలార ! యువతా పతాకలార ! కదదాము రండి కాలపు తీరాల మీద బొమ్మరిళ్ళు అల్లరి చేద్దాము రండి " అంటూ పిల్లల్ని, యువతను ఆహ్వానిస్తున్నారు శేషేంద్ర "గొర్రిల్లా" సమాజహితం కోరి వ్రాయబడిన కావ్యం. అది కవి ధర్మాగ్రహం సమాజం లోని దుష్ట సంస్కృతిని నిర్మూలిం చడానికి.

## చివరగా శేషేంద్ర గొర్రిల్లా కావ్యం లోని కొన్ని ముఖ్యమైన కవితా పంక్తులు

1.మనం తుపాకుల్ని ఎదుర్కొగలం గానీ
నియంతలు ప్రశ్నల్ని ఎదుర్కోలేరు.
2.అంతరాత్మ కోడై కూస్తోంది కుక్కయ్ అరుస్తోంది
పక్షయ్ పాడుతోంది అది కానీదేదీ లేదు దేశం కోసం
3. జీవితం దుఖాన్ని రాసులు రాసులుగా పోసుకుని
అమ్ముతోంది మన దేశపు బజార్లలో.
నీకు తెలుసా వ్యవసాయ కూలీల ఆకాశం వర్షాలు కురుస్తుందే
కానీ వసంతాలు కురవదు
4. చావు నెదుర్కోవడం కంటే బతుకు నెదుర్కోవడం పెద్ద సమస్య అయింది
నా దేశం లో శవం చెబుతుంది
బ్రతికున్న వాడి కంటే ఇంకా బాగా బతకడం అంటే ఏమిటో
5.శ్రమించే కండరాలు కోర్కెల సమాధులు కావు.
నీకు రెక్కలివ్వడానికే నిద్రపోకుండా మేలుకొనివుంది నా కిటికీ
6. నా పిల్లల చేత వాడు నా తిండి తినిపించకపోతే
భూమి చేత నేను వాడి రక్తం తాగిస్తా.
నా కవిత్వం ఏ జెండా ను ఎగరేయదు.
కానీ నా చేతులు నా దేశపు ఖడ్గాలు
7. గుండె ఒక బ్రహ్మాండమైన మానవీయ లోయ
దేనిలోకి ధైర్యం ఒక నిర్మల ప్రభాత దేవత లా నడుస్తుందో....
ఎన్ని మైళ్ళు అని కాదు ఎన్ని శవాలు ముందుకు పోయిందో
మన ఉద్యమం కొలుచుకో
మిత్రమా ఇదిగో నా హృదయం విసిరేస్తున్నా పట్టుకో
8. ఒక దుర్మార్గ వర్గపు శిరస్సు మీద ఔదార్య దయా త్యాగాల తో అల్లిన కీర్తి మండలాన్ని
కిరీటంగా నా చేతులతో అలంకరించలేను.
వాళ్ళ దాన ధర్మాలు భుజించే నికృష్ట జీవి గా రూపెత్తలేను.
నా హక్కు కున్న కండ బలంతో నా స్థానం గడించుకుంటాను చరిత్రలో.
లేదా నా రక్త ధారల్ని భూమండలం మీద
అంతరాత్మల్ని బాధిస్తూ ప్రవహించమని చెప్పి వెళ్లి పోతా .

శేషేంద్ర "గొర్రిల్లా" కావ్యానికి ఇది స్వర్ణోత్సవం. శేషేంద్ర ప్రాతస్మరణీయులు సాహితీ లోకంలో..




-సబ్బని లక్ష్మీనారాయణ
8985251271

## కణిక

సాహిత్యం, సామాజిక సేవ, విద్యారంగ వేదిక నిర్వహిస్తున్న 'బుధవారం బాద్షా' పోటీ ఫలితాలు



అడ్మిన్: రమాదేవి కులకర్ణి
8985613123



నిర్వహణ: శ్రీమతి సత్య నీలిమ

### నన్ను నేను కోల్పోతున్నా ...

ఎన్ని దినాలయిందో సమయానికి భోజనం చేసి
ఎన్ని రాత్రులైందో ప్రశాంతంగా నిద్రపోయి
ఎన్ని రోజులయిందో పిల్లలతో మనసు విప్పి మాట్లాడి
ఎన్ని నెలలయిందో అమ్మకి ఫోన్ చేసి.
సాఫ్ట్వేర్ ఉద్యోగి జీవితం హార్డ్ గా మారింది
పగలనక రాత్రనక పరుగుల జీవితంలో
నన్ను నేను కోల్పోతున్నా ...
నెల జీతం ఎప్పుడు వచ్చిందో తెలీదు
ఎంత వచ్చినా ఈఎమ్ఐ లు పోను
చాలీచాలని మిగులు కన్నీరు తెప్పిస్తోంది.
పిల్లలు నన్ను చుట్టంలా చూస్తున్నారు
ఆటలేదు మాటలేదు ఆలింగనం లేదు
తండ్రిగా సమయం ఇవ్వలేక పోతున్నాను.
నన్ను నేను కోల్పోతున్నా ...
బతుకు బరువుగా లాగుతున్నా
బండ రాయిగా మారుతున్నా .
లేకుంటే లేఆఫ్ లో కొట్టుకు పోవలసిందే
అందుకే అన్నీ మరచిపోతున్నా!
నన్ను నేను కోల్పోతున్నా !!

-భళ్ళమూడి నాగరాజు
హైదరాబాద్

### నేనెక్కడ

అమ్మ చూపిన ప్రేమలో
నాన్న చేసిన లాలనలో
స్నేహితుల ఆటపాటలలో
ఇంటిల్లిపాది అభిమానంలో
భక్తి భావపు పరవశంలో
నైతికవిలువల కట్టుబాట్లలో
కష్టపడి శ్రమించే తత్వంలో
సాధన పట్టుదల బాధ్యతలలో
పుట్టిపెరిగిన నేనూ..
కోల్పోతున్నా నన్నులో వెతికాను
నేనెక్కడున్నానని నాటి నేనును.
అమ్మ నాన్నలు అనాధాశ్రమంలో
ఆటపాటలు అంతర్జాలంలో
సమయమంతా చరవాణిలో
యువకులు సోమరితనంలో
మేడలు మిద్దెలు ఊహాలలో
జీవితమంతా ఆడంబరాలలో
మానవత్వమంతా మంటలలో
మనిషితత్వాన్ని విడిచే భూతంలో
అగుపిస్తుంది నాకు ఆనాటి నేను.
సమాజం కాలం మారినా
మానవత్వానికి చిగురులు తొడిగి
మనలో ఉన్న నేనును
కాపాడుకుందాం
నవశకానికి నాంది పలుకుదాం.

-మండికారి బాలాజీ

### ఏమైపోతున్నా నేను!

నేను మనిషినన్న మాటే మరిచిపోయాను
క్రమశిక్షణ లేని జీవితాన్ని దొర్లిస్తున్నా
వివేక విచక్షణలు కోల్పోతున్నా
క్షణం క్షణం బ్రతుకు భయంతో చస్తున్నా..
బంధాల అనుబంధాల ఆనందాలను కోల్పోతున్నా
చుట్టూ మనుషులు ఉన్నా
ఒంటరినై పోతున్నా
దారీ తెన్నూ తెలియని చీకటిదారుల్లో పయనిస్తున్నా..
ఆశలు అందని అడియాసలై
నిరాశా నిస్పృహలతో కొడిగట్టిన దీపంలా
గతి తప్పిన జీవితంతో చెడుగుడు ఆడుతున్నా
మనసుని చంపేస్తున్నా
అద్దంలో చూసుకుంటున్నా నేను నేనేనా అని..
ప్రగతి పథంలో పరుగులు తీస్తున్నా
విలువల వలువలను విడిచివేస్తున్నా
కరుణా జాలీ దయా భావంతో దీనులను
దగ్గరికి తీసుకోవాలనే ఆలోచనలే లేని నేను
నను నేనే నమ్మలేకపోతున్నా!
కాలం మాయలో పడి మనిషిగా
జీవించలేకపోతున్నా, ఆదీ అంతం లేని
సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్నా..!
గుండెల నిండా గూడు కట్టుకున్న అసహనంతో జీవిస్తున్నా ..!
పోయేటప్పుడు ఎవరూ లేరని ఎవరూ రారని
చివరికి మిగిలేది శూన్యమేనని నను నేను నచ్చజెప్పుకుంటున్నా
కొడి గట్టిన దీపంలా..

-పద్మావతి పి.
హైదరాబాద్

### అవునా! కాదా !

అవును
నిజమే
నేను అన్నీ కోల్పోయాను
నన్ను నేను కోల్పోయాను
గుర్తించే సరికి
జీవితం చివరి అంకంలో ఉన్నాను.
నాతో ఉన్న వాళ్ళందరూ
నా వాళ్ళని మురిసే దాన్ని
వారికి తల్లో నాలిక లా మసిలే దాన్ని
నా అమాయకత్వమే
నాకు శాపంగా మారింది.
నీకు ఏమీ తెలియదు
నోరు మూసుకో అంటే నిజమనుకునే దాన్ని
అందుకే అందరికీ దూర దూరంగా ఉండేదాన్ని.
నా వలన అవతల వారికి
ఏమి కష్టమవుతుందో అని మందిని పడేదాన్ని
ఎపుడూ ఏదో పోగొట్టుకున్న దానిలా ఆందోళనతో బతికే దాన్ని.
నా గురించి ఆలోచించలేని మానసిక స్థితి నాది
ఏం కావాలో ఎలా ఉండాలో తెలియక
సతమతమవుతున్న దాన్ని.
ఎవరికీ పట్టని నా జీవితం పట్ల నాకు కనీసం కనికరం లేదు
ప్రేమించటం ప్రేమించబడటం తెలియని దాన్ని.
పిరికితనం,భయం నన్ను ఇంటా బయటా
నన్ను నన్నుగా నిలువ నీయలేదు
నన్ను నన్ను గా
బతుక నివ్వలేదు బతుకు నివ్వలేదు
ఎవరో ఏదో అనుకుంటారని
అనుక్షణం నాలో నేను కుమిలేదాన్ని
నన్ను నేను తక్కువ చేసుకొనే దాన్ని
నాలో ఏదో లోపమున్నట్లుగా ఆత్మన్యూనత తో అలమటించేదాన్ని
ఏదేమైనా నన్ను నేను కోల్పోయాను అన్న బాధ
ఇప్పటికీ నన్ను వీడటం లేదు
కనీసం ఇప్పటికయినా
నన్ను నేను కొంతయినా మిగుల్చు కుందామనే
ప్రయత్నం లో ఉన్నా
ఎందుకంటే నాకు నేను
ఎప్పటికయినా సమాధానం చెప్పుకోవాలిగా

-ఆలేటి పరంజ్యోతి
ఖమ్మం

# ఏది కష్టం - ఏది తేలిక ఓ మహాత్మా!



– పి.చంద్రశేఖర అజాద్
92465 73575

మా దగ్గరికి ఓ సమస్య వచ్చింది. దానిమీద తీర్పు చెప్పాలి. 'కాలమ్' రాస్తున్నంత మాత్రాన ప్రపంచంలోని అన్ని సమస్యలు మనకు తెలిసిపోతాయా! మన ఇష్టానికి దేని గురించయినా మాట్లాడటమేనా? లోకంలో అందరినీ విమర్శించటం మాకు హక్కా! కార్టూన్లు వేసేవారు, కథలు రాసేవారు, గీతాలు రాసేవారు ఇలాంటి వర్గం జాబితా పెద్దది కదా. ఏమాత్రం బాధ్యతలు మాకు వుండవా!




ఈ విషయం మీద అన్య, విదూ, ఇంకా మా బృందం సీరియస్గా చర్చలు జరిపాం. ఇప్పుడు లోకంలో అందరూ ప్రవచనాలు చెప్పటానికి బాగా అలవాటుపడ్డారు. ఎదుటివారికి చెప్పేందుకే నీతులు వున్నాయి అనే విషయంలో ఎవరికీ అభ్యంతరం లేదు. ఏ ప్రవచనం ఎన్ని డబ్బులు తీసుకువస్తుంది. ఎంత కీర్తిని తీసుకువస్తుంది. ఇవన్నీ వస్తున్నప్పుడు సిగ్గూ, శరమూ మనకేలా! ఆ విషయాల్లో సైలెంట్గా వుండటమే బతుకుతెరువును కొనసాగించే అద్భుతమైన కళ. కళ అంటే ప్రాక్టీస్ వుండాలి కదా. అందుకే ఇన్నిరకాల విన్యాసాలు అనుకున్నాం.

కాగా మనం మాత్రం తీర్పులు ఇవ్వకూడదు. మనకింకా అనుభవంలోకి రాని విషయాల మీద మాట్లాడమంటారు. అయినా రెచ్చిపోకూడదు. ఇలాంటి సమస్యలు వచ్చినప్పుడు అనుభవం వున్న పెద్దవాళ్ళని ఇన్వాల్వ్ చేద్దామని అంగీకారానికి వచ్చాం.

అందుకని మా తాతగారిని పిలుద్దాం అని అన్య అన్నా-ఇంకెవరినన్నా చూద్దాం. మా తాతగారిని లోకం కీర్తించాలి లేదా విమర్శించాలి. అవన్నీ మనం చేస్తే ఇది బృందగానం అవుతుంది అన్నాను. అప్పుడు మాకు ఓ పెద్దాయనను సూచించారు. ఆయన గురించి వివరాలు సేకరించాం.

వారి పేరు ఏదో వుంది. అది జనం మరిచిపోయారు. 'మిస్టర్ క్లీన్' అని కొందరు అంటారు. ఆయన దగ్గర రెండు డజన్ల తెల్లటి ఖాదీ చొక్కాలు వుంటాయి. అలాగే పంచెలు వుంటాయి. వాటికి గంజి దట్టంగా వుంటుంది. అవి మెయిన్టెన్ చేయటానికి ఎంత ఖర్చవుతుందో వారి హోమ్ డిపార్ట్మెంట్ వారు చెప్పాలి. తన మీద ఎంత బురద జల్లినా చిరునవ్వుతో వుంటారు. తన బట్టల మీద చిన్న మరకపడినా అగ్గి మీద గుగ్గిలం అయిపోతారు.

ఇంకొందరు 'మిస్టర్ పెర్ఫెక్ట్' అంటారు. అసలు ఎవరేం చేసినా, రాసినా ఆయనకు నచ్చదు. మరి మీ పరిస్థితి ఏమిటి అంటారు. నేను కూడా అంతేరా నాయనా. ఈ లోకంలో పెర్ఫెక్ట్ అనేది వుండదు. నాకు నిక్ నేమ్స్ పెట్టటంలో కూడా మీరు బచ్చాలే అంటాడు. ఇతరుల్ని విమర్శిస్తే మనమూ నాలుగురాళ్ళు విసరవచ్చు. తనని తాను విమర్శించుకునే వాళ్ళను ఎవరు మాత్రం ఏం చేయగలరు!

ఆయన్ని పొగిడినా సమస్యే. నువ్వు ఎందుకు చిడతలు అందుకున్నావో నాకు తెలుసు అంటాడు. సో? ఎవర్ని ఏదన్నా అనాలన్నా, అనిపించుకోవాలన్నా ఆయనకు ఆయనే సాటి. అందుకని 'మిస్టర్ డోంట్కేర్' అనిన్నూ పిలుస్తారు. ఆ మాస్టార్ని కూడా అప్పుడప్పుడు డిస్కోర్స్లకు ఆహ్వానిద్దాం.

ఇప్పుడు సమస్య రచనలది. అంటే అన్ని ప్రక్రియలది. అలాగే ఇక్కడ జెండర్ లేదు. సృజనకారులు అందాం.

"కథ రాయటం అంటే అది చిన్నపనా! దానికి ఎంత అధ్యయనం కావాలి. ఎంత పరిణతి కావాలి. కథ మనుషుల్ని ఉన్నత స్థితికి చేరుస్తుంది. సమాజాన్ని కుదుపుతుంది. అందుకే కథా-కథానిక అన్ని ప్రక్రియల్లో అగ్ర భాగాన నిలుస్తుంది. కథ రాయటమంత కష్టమైనది ఇంకోటి లేదు" ఇది కథకుల అభిప్రాయం. విన్నాక 'తర్వాత' అన్నాడాయన.

"కవిత్వం రారాజు. సమాజంలో ఎలాంటి మార్పులు వచ్చినా, కుదుపులు వచ్చినా ముందుగా రికార్డ్ చేసేది కవిత్వం ద్వారానే. మీరు ఏ దేశంలో అయినా చూడండి కవిత్వానికి వున్నంత ఆదరణ, శాశ్వతత్వం మరో ప్రక్రియకు లేదు. కేవలం కొన్ని లైన్లలో జీవితసారాన్ని చెప్పటానికి కవులు పడే తపనకు ఖరీదు కట్టే షరాబు ఎవడున్నాడు?" ఇది కవుల ఆభిజాత్యం.

"నెక్ట్" అన్నారు మిస్టర్ క్రిటిక్.

"పాట. పాటే ఆయుధం. అది పాడుకుంటారు. పాటే ఎన్నో ప్రభుత్వాలను కూలదోసింది. విప్లవాలను తీసుకొచ్చింది. నవ్వినా, ఏడ్చినా పాటే తోడు. పాటను మించిన మంత్రం ఎక్కడ వుంది. కథలూ, నవలలూ, కవిత్వం ఎవరయినా రాయగలరు. పాటను మాత్రం కొందరే రాస్తారు" ఇదో గీత రచయిత స్వగతం.

"పిమ్మట" అన్నారు మన అతిథి నోట్లో లంక పొగాకు చుట్ట వెలిగించుకుంటూ!

"నాటకం. అన్ని ప్రక్రియలకు ప్రారంభం. ఇందులో అన్నీ వుంటాయి. ఏ దేశంలో నాటకం వుండదో ఆ దేశం భ్రష్టు పట్టిపోతుంది."

ఇంకా కొన్ని ప్రక్రియల ప్రస్తావన వచ్చింది.

ఇప్పుడు మన మహోపన్యాసకుడి వంతు వచ్చింది. మాట్లాడబోయే ముందు స్ట్రాంగ్ ఫిల్టర్ కాఫీ స్వీకరించారు. కాఫీ మీద నురగను ఉప్పున వూదారు.

"ఇందులో ఏది కష్టం. ఏది తేలిక. ఎవరు రాజు, ఎవరు సైనికుడు అనేది ఆ ప్రక్రియను రాసేవాడి తుత్తి. ఈ ప్రపంచంలో ఏది తేలికా కాదు. ఏదీ కష్టం కాదు. మన తెలుగులో తరాలుగా కొన్ని లక్షల చెట్లను ఈ అనవసర వివాదాల కోసం నరికేశారు తెల్లకాగితాల కోసం. మన దరిద్రాలకు ప్రకృతి ఎందుకు నాయనా బలి కావాలి! నేను మీ కొత్త తరానికి మృదువుగా చెబుతున్నాను. మన శరీరంలో ఏ అవయవం రాజు-రాణి అంటే ఏం చెప్పగలం. చిన్నప్పుడు కథ చదివారు కదా-శరీరంలోని అవయవాలన్నీ సమ్మె చేస్తే ఏమయిందో! అందుకని ఒక్క ముక్కలో 'మంచి' రచనలు చేయటం కష్టం. అది ఏ ప్రక్రియలో అయినా. దాని గురించి ఆలోచించండి. ఇది ఆరంభమే. ముందు ముందు మనం ప్రవచించాల్సినవి చాలా వున్నాయి" అని ముక్తాయింపు ఇచ్చారు. సో? ఇది ముగింపు కాదు.

# పృథ్వీగారి వ్యంజకాల విశ్లేషణం రంజుగా ఉంది

పుస్తక సమీక్ష




ప్రతులకు:
శ్రీమతి పి.ఉషారాణి,
రామకృష్ణానగర్,
రాజమహేంద్రవరం
-533 101
ఆంధ్రప్రదేశ్



లఘు కవిత్వంలో వ్యంజకాలు అంటూ ఎస్.ఆర్. పృథ్వీ వివిధ కవులు వ్రాసిన వ్యంజకాలను విశ్వేషించారు. వ్యంజకాల నేపథ్యం గురించి చక్కగా వివరించారు. వాటి రూప నిర్మాణం గురించి కూడా చెప్పారు. ఈ మధ్య కాలంలో ఎన్నో వచన కవితా ప్రక్రియలు కవితా లోకంలో ఆవిర్భవించాయి. రుబాయీలు, నానీలు, నానోలు, రెక్కలు, ఇక మన పొత్తూరి వారి వ్యంజకాలు. ఎందరో కవులు వ్యంజకాల సంపుటులను వెలువరించారు. వందలాదిగా కవులు నిరంతరం వ్యంజకాలను రాస్తూనే వున్నారు. వ్యంజకం అంటే వ్యంగ్యం అది చెబుతారు. రెండు లైన్లలో పాజిటివ్గా చెప్పి, మిగిలిన రెండు లైన్లలో దానికి ప్రతికూలంగా వుండేలా రాయడం విశేషం. అయితే ఆ పంక్తులు వినసొంపుగానూ, చదివితే ఒక అనుభూతినీ కలిగించాలి.

**భారతయులంతా**
**ఒకే జాతి ఒకే రీతి**
**కుల సంఘాల నాయకత్వంపై**
**ఎవరికి వారే పోటీ**

మొదట రెండు పాదాల్లో జాతి అభ్యున్నతి కోసం కుల మత రహిత సమాజం కావాలంటారు. చివరి రెండు పాదాలలో కుల సంఘానికి నాయకత్వం వహించడం కోసం పోటీపడతారు అంటూ పృథ్వీ గారు విశ్లేషించారు.

మరో వ్యంజకం వి.ఎస్. పారిజాతం గారిది. స్త్రీలు సాధారణంగా తమ గురించి, తమ కుటుంబం గురించే అంటే తన భర్త పిల్లలు గురించే ఆలోచిస్తారు. ఈతరంలో ఎక్కడోగాని సకుటుంబం గురించి ఆలోచించే వారుండరు. స్వార్థ చింతన ఎక్కువగా కనిపిస్తుంది. వివాహం అయినా, వాళ్ల తల్లిదండ్రులకిచ్చే ప్రాధాన్యత అత్తమామలకివ్వరు. ఈ వాతావరణాన్ని వి.ఎస్. పారిజాతం గారు ఒక కవితలో ఉదహరించారు. స్త్రీలలో వుండే ద్వంద వైఖరికి ఇది చక్కటి ఉదాహరణ. సహజ సిద్ధమైన స్త్రీల స్వార్థానికి నిదర్శనం అన్నది పృథ్వీగారి విశ్లేషణ. వ్యంజకం ఇలా వుంది.

**కూతుర్ని అత్తారింటికి పంపేటప్పుడు**
**తల్లి చెబుతుంది మొగుణ్ణి కొంగున ముడేసుకోమని**
**ఆ తల్లే కొడుక్కి పెళ్లయ్యాక**
**నీ పెళ్లాన్ని చెప్పుకింద తెలు**
**లా ఉంచాలి అని.**

ఒకప్పుడు చేతి వృత్తులు జాతికి జీవగర్ర. కాలం మారింది. మరొకటి ప్రభుత్వాల నిర్లక్ష్యం. ఇప్పుడవి వతనం అంచుకు చేరాయి. నేత కార్మికులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. వాళ్ల భవిష్యత్తు గురించి సందర్భాను సారంగా కల్లబొల్లి మాటలు చెబుతారు తప్ప నిజాయితీగా ఆలోచన చేసే నాయకులు కరువయ్యారు. ఎన్నికల సమయంలో మాత్రం కంటి తుడుపు వాగ్దానాలు పార్టీల జెండాలపై ఎగురుతాయి. ఫలితం శూన్యం. నేత కార్మికుడికి దయనీయమైన ఆర్థిక స్థితికి ఉదాహరణ ఈ కవిత.

**అగ్గిపెట్టెలో పెట్టే ఆరుగజాల చీర**
**అలవోకగా నేసాడు నేతన్న**
**పెళ్ళాం అడిగితే కొత్త చీర**
**నేయడానికి కొట్టు మిట్టాడుతున్నాడు**
**ఇదీ నేత పరిశ్రమలో కార్మికుల పరిస్థితి.**

మార్పు కోసం ఎదురు చూడదం తప్ప, మరో మార్గం కనిపించని నేత రంగానిది దురదృష్టమని చెప్పాలి' అంటూ పృథ్వీగారు రాసుకొచ్చారు.

ఈ విధంగా ఎందరో కవులు రాసిన వ్యంజకాలను ఎన్నుకొని తమ వ్యాఖ్యానాన్ని ఇచ్చారు.

అందాల సుందరి పోటీలపై ప్రతాపరెడ్డి ఒక వ్యంజకం రాస్తే పృథ్వీగారి విశ్లేషణ చూద్దాము.

**'ఆమె శిరస్సున మెరుస్తున్న స్వర్ణ కిరీటం**
**ఏ దేశపు రాకుమారి మాత్రం కాదు**
**ప్రపంచ సుందరీమణుల పోటీలో**
**ఎంపికైన విశ్వ సుందరిది"**

ఈ వ్యంజకంపై పృథ్వీగారి విశ్లేషణ ఇలా వుంది. స్త్రీల అందాల్ని రోడ్డు కెక్కించి, ప్రపంచంలోనే అత్యంత అందమైన సుందరివి అంటూ నెత్తిన కిరీటం పెట్టే సంస్కృతి పాలిస్తున్న రోజులివి. స్త్రీ పరదా చాటున వుండే రోజులు ఏనాడో పోయాయి. అర్ధనగ్నంగా శరీర సౌందర్యాన్నీ విశ్వ వీధుల్లో ప్రదర్శించే కాలమిది. అటువంటి ప్రపంచ సుందరి ఫోటోలను ఉద్దేశించి ఎస్.ఆర్. ప్రతాపరెడ్డి గారి కవితను ఉదహరిస్తూ పృథ్వీగారు చేసిన విశ్లేషణ రంజుగా వుంది కదూ!

ఇక తాము రాసిన వ్యంజకాలను కూడా వివరించారు పృథ్వీగారు.

**నల్లధనం మంట**
**పెద్ద నోటుల రద్దు**
**ధనవంతుడు గట్టున**
**సామాన్యుడు రోడ్డున**

నోటుల రద్దు కారణంగా అనేక ఇబ్బందులు సామాన్య ప్రజానీకాన్ని కుదిపివేసిన సంగతి తెలిసిందే. ఈ అంశం తీసుకుని ఒక విషయాన్ని ఎస్.ఆర్. పృథ్వీ ఒక కవితలో ప్రస్తావించారు. ఆ రోజుల్లో సామాన్య ప్రజలు రదయిన నోట్లు మార్చుకునేందుకు పడిన కష్టాలు చూసిన వారికే తెలుసు అంటూ తమ వ్యంజకం మీద కూడా వ్యాఖ్యానించడం గమత్తుగా వుంది. వారిదే మరో కవిత విషయంలోనూ వ్యాఖ్యానం ఇలా వుంది. కొందరు స్త్రీలు అక్రమ సంతానాన్ని గాని, పోషించలేని దుర్భర స్థితిలోగాని సంతానాన్ని ఏ అనాధ ఆశ్రమం వద్దనో, గుడిమెట్ల వద్దనో వదిలేస్తుంటారు. పురిటి బిడ్డను చెత్తకుండీలో పడవేసిన సందర్భాలు కూడా మన మెరుగుదుం. దీనికి కారణం క్షణికావేశం కావచ్చు. మోసానికి గురైన సందర్భాలు ఉండవచ్చు. ఏదైనా నష్టపోయేది పసికందు. ఈ నేపథ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఒక కవి వ్రాసిన కవిత ఇది.

**గుండెకు హత్తుకున్నప్పుడు**
**అమ్మలోంచి అమృతం తొంగి చూస్తుంది**
**గుడి గుమ్మం ముందు వదిలినప్పుడు**
**ఆమెలోని విషం బైటికి పొంగుద్ది.**

**అమ్మ ఎప్పుడూ అమృత భాండమే కదా!** కవి ఆమెలోంచి విషం బైటకు పొంగుద్ది అనడం ఏమో నాకైతే మింగుడుపడటం లేదు. ఏది ఏమైనా పృథ్వి వంటి ప్రముఖ కవి వ్యంజకాల వ్యాప్తికి. ప్రాచుర్యానికీ చేస్తున్న కృషిని అభినందించకుండా వుండలేను. త్వరలో వీరి నుండి మరిన్ని విశ్లేషణాత్మక రచనలు రాబోతున్నాయని తెలిస్తే చాలా ఆనందంగా వుంది.



– డా॥ పులివర్తి కృష్ణమూర్తి
సెల్:9949092761

# తరువు మన కల్పతరువు

## కవితార్చన



అడ్మిన్: డా॥రాధాకుసుమ
సెల్:99892 41319

"కుసుమ ధర్మన్న కళా పీఠం" సంస్థ ప్రతిరోజు కవిత్వ రచన చేయిస్తుంది.
అందులో ముఖ్యమైన కొన్ని కవితలను నేటినిజం పాఠకుల కోసం ప్రత్యేకంగా అందిస్తున్నాం..
-సంపాదకులు

పచ్చని ప్రకృతి ధరిత్రికి
అందమైన ఆభరణం,
జీవరాశులన్నిటికీ
అది అమూల్యమైన వరం.
పక్షుల గూళ్లకు చెట్టే మధురమైన నిలయం,
మృగజాతుల జీవనానికి అడవే ఆశ్రయం.
జనం స్వార్థంతో అడవులు నశిస్తున్నాయి,
మూగజీవాల కన్నీళ్లు నేలను తడుపుతున్నాయి.
జననం లోఉయ్యాలగా ఊరడిస్తుంది,
ప్రాణవాయువై ప్రతి జీవిని కాపాడుతుంది.
వానలను కురిపించి పంటలకు ప్రాణమిస్తుంది,
ఆహారమై ఆకలి బాధలను తొలగిస్తుంది.
చెట్టే మనిషికి నిజమైన కల్పతరువు,
ప్రకృతే సృష్టిలో అద్భుతమైన గురువు.
మరణంలో చితిగా మారి మనిషిని కాలుస్తుంది,
పర్యావరణ రహస్యాన్ని మౌనంగా తెలియజేస్తుంది.
పకృతిని కాపాడితే భూమి నవ్వులతో నిండుతుంది,
పచ్చదనం పెరిగితే ప్రతి జీవికి భవిష్యత్ నిలుస్తుంది.

-కె వి. సుబ్రహ్మణ్యేశ్వర రావు, +91 99485 15560

### పకృతి వెన్నెలై కురిసే

నింగి సాక్షిగా ధరిత్రి ఒడిలో
తారలా మెరిసే మనిషి జననం
ప్రకృతి ఒడిలో ఇంద్రధనస్సుల మెరిసే చోట
మానవ మనుగడకు జననం అంకురార్పణ
చెమట చుక్కలు కన్నీరు ధారలై పారిన
జీవన ప్రయాణంలో అమావాస్య చీకట్లు
ముసురుకున్న ఆశల దీపాలు వెలుగుతాయి
నా నీ గుండెల్లో
జననం అందమైన రూపాన్ని ఇచ్చే
శుభ ఉదయం
మరణం తప్పదు ప్రతి జీవికి
జననం మరణం మధ్యలో ఒడిదుడుకులప్రయాణం
చివరికి ప్రకృతి ఒడిలో మనిషి అంతిమయాత్ర
శాశ్వతం కాని ఈ దేహానికి ఈర్ష ద్వేషాలు
తేనెటీగలై ముసురుకున్నాయి
మట్టిలో కలిసిపోయే మనిషికి కట్టే అవసరం
ప్రకృతి అందించే మనకు అంతిమ నివాళి
జనం గుండెల్లో నిలిచిపోయే మంచి జ్ఞాపకం
అందమైన జీవితాన్ని పూదోటలా మలుచుకుంటే
ఇదే మనిషికి నిజమైన పరిపూర్ణ అర్థం
ధరిత్రి ప్రకృతి జనన మరణానికి ఆలంబనం

-సుజాత కోకిల, +91 98491 08934

### గుండు మల్లికార్జునరావ అగ్నిగుండం

సుందర జల ప్రవాహాల..
మనోహర సముద్ర తీరాల..
లేలేత పచ్చ చీరలు చుట్టిన ధరిత్రి హేల..
సర్వ జీవకోటికి అందించు పంచభూతాల.
గడిచిపోయిన చరిత్రల ఆనవాలు..
తలచి తలచి కుములుతున్న అవని అంతరాలు..
దుష్ట మానవులు చేస్తున్న అవాంతరాలు..
దినదినానికి కాలుష్యం ప్రబలుతున్న వైనాలు.
సలసల కాగుతున్న సముద్ర జలాలు..
అంతమైన హరితారణ్యాలు..
నిత్యం వాహనాల, ఫ్యాక్టరీల కాలుష్యాలు..
శిక్షార్హులు! ప్లాస్టిక్ వాడకాలు, కేవలం నినాదాలు.
నడుస్తున్నది అగ్నిగుండంలోకి అని తెలిసి..
ఆజ్యం పోసుకుంటూ నోట్లు చూసి మురిసి..
'ప్రకృతి'ని అంతం చేస్తూ విలాసాలకు భ్రమిసి..
భవిష్యత్తును మర్చిపోతున్నాడు మనిషి?
మరణ రోదన వినిపించడం లేదు చెవులకు..
అరణ్యాలన్నీ అంతమైపోయే వరకు..
నదీ నదాలు ఎండిపోతే మిగలదు మంచి బతుకు..
చివరికి మిగిలేది మనిషి ఘాతకాల రంకు.
మత్తు వదలని మనిషీ, మేలుకొని ఆలోచించు..
చెట్టు నాటను అడుగు ముందుకు వేయించు...
ధరిత్రి ఏడిస్తే! మీ బిడ్డలు బ్రతుకరు ఆలోచించు..
చెట్టు నాటు, నదిని బ్రతికించు, ప్లాస్టిక్
వీడు ప్రకృతిని ప్రేమించు!
ధరిత్రిలో ప్రకృతి పచ్చగా ఉన్నంతవరకే మన క్షేమం..
తన తుది శ్వాస వరకు కాపాడుతుంది మన మరణం..
ఇప్పటికే మోయలేని భారాన్ని మోస్తుంది జనం ఆకృత్యం..
ప్రకృతి విలయతాండవము చేస్తే,
దరిత్రిలో జనం సర్వం మరణం.

-గుండు మల్లికార్జునరావు, 8978026059

### అవివేకమే

సమస్త జీవకోటికి ఆధారమైన
ధరిత్రి భగవంతుడు ప్రసాదించిన వరమే..
గాలి నీరు ఆహారం అందించే ఈ భూమి కన్నతల్లితో సమానమే..
ఎన్నో లక్షల జీవరాశుల ఉత్పత్తికి మూలమైన స్థానమే..
అన్నిజీవులలో మానవుడే అధికుడని చాటే లోకమే..
సృష్టి జనన మరణ చక్రం సాగే
పంచభూతాలతో కూడిన ప్రకృతి ఓ అద్భుతమే..
పచ్చదనం పక్షులు జంతువులు ఎన్నో వేల జీవరాశుల నిలయమే..
ఎండా వాన గాలి చలి మంచు వేడి ప్రకృతి లక్షణాలే..
ప్రకృతే వికాసానికి మూల కేంద్రమే నిరంతరం సాగే
సృష్టి చక్రమే..
పంచభూతాలన్నీ ప్రకృతిలో అంతర్భాగమే..
ప్రకృతి రహస్యాలను చేధించిన మనిషి ఆలోచన విషతుల్యమే..
ఏ జీవిని ఎదగకుండా చేసేది మాత్రం మానవ నైజమే..
అందుకే భూమంతా నిండిపోతున్న జనం సృష్టిలో
సంచలనానికి కారణమే..
మనిషి సృష్టిలో కృత్రిమవిజ్ఞానం
కాలుష్యానికి వినాశనానికి సాధనమే..
చేసే ప్రయోగాలు కనిపెడుతున్న
ఆయుధాలు బాంబులు ప్రమాదసూచికలే.
కృత్రిమ వినాశకపదార్థాలు మందులు మానవనాశనానికి మార్గాలే..
ప్రకృతిని వికృతిగా మార్చి మనిషి పొందేది తాత్కాలికానందమే..
సృష్టిలో మనిషి మరణం కోరి తెచ్చుకుని ఉనికిని కోల్పోవడమే.
దీర్ఘాయువు కలిగిన మనిషి తన చేష్టలతో సృష్టించేది వినాశనమే..
ప్రకృతి నాశనమే
సమస్త జీవకోటి నాశనమని తెలుసుకోలేని అవివేకమే

-డి.టి.హేమంత్ సింగ్
+91 81214 30560

## కూలీ

కాలీ కడుపు
నింపే కోసం
కారే కన్నీరు
ఆపే కోసం
రోజు కూలీ నాలి
పాపం అమాలి
ఎండలో కండలు వేడెక్కినా
గుండెలో మంటలు రేగినా
గుడికి,బడికి,పెద్దసారు విశ్రాంతికి యాల్లున్నా
మా బతుక్కు రేయింబవళ్ళు
రెక్కల కష్టమే దిక్కైనా
కులీ చేతులు కాలీగానే మిగులుతున్నాయ్
పనికాడ, ఫ్యాక్టరీకాడ,గనికాడ
గుడారాలే గూడై
అలసి సొలసి సొమ్మసిల్లి
మట్టిదిబ్బలే పట్టు పానుపులనుకొని
ఒరిగిన పెయ్యికి
చెమట బిందువులను తాకిన
చల్లగాలి సేదతీర్చుతున్నా పురుగు పుట్రా
ఎన్నెన్ని చుట్టుముట్టినా
మమ్మల్ని దీనంగా చూసి
దానుంగా అవే వెళ్ళిపోతాయి
ఈ శ్రమ దోపిడీకి
మా దరిద్ర తాండవానికి
అక్షరమైన మా పిల్లలకు అదృష్టం కాకపోతే
మరి ఎవరికోసం ఈ బతుకు పోరాటం.



-పోలీస్ భీమేశ్
9505255218

## కవి-కవిత

కలం కదిలితే గళమెత్తాలి
సమాజ హితం కోరాలి
సత్యం వైపున నిలబడాలి
నిదుర కళ్ళను తట్టిలేపాలి.

కవికి ఉండాలి సామాజిక దృక్పథం
అక్షరమే కదా అతడి ఆయుధం
నిప్పులు చెరిగే వాక్యాల కావ్యం
నిజాలను పలికే నిక్కమైన లక్ష్యం

కవితకు ఉండాలి కదిలించే
శక్తి
ప్రశ్నించే ధైర్యమే కవితకు పునాది
సత్యం చెప్పని కవిత్వాలు వెలగవు
అంత్యప్రాసల అల్లికే కాదు అసలైన
అంతరార్థం ఉండాలి
యతి ప్రాసలు కవితా పాదాలకు ప్రాణం
నైతిక విలువలే శ్రీరామ బాణం

కలం అంటే కాగితంపై గీత కాదు
గుండెలోని మంటకు చిరునామా
అశాంతిని తొలగించే మంత్రం
కవిత్వమే సమాజ యంత్రం

ఒక్క అక్షరం చాలు చైతన్యం నింపగ
ఒక్క వాక్యం చాలు చీకటిని చంపగ
కవి ఉండాలి లోకానికి కనురెప్పలా

నిజాయితీ గల రచనలే సంఘహితం
కవికి ఉండాలి లోతైన ఆవేదన
ఉండాలి మంచిని అందించే యోచన

వ్యర్థపు అక్షరాలు అక్షర దోషాలు
అర్థవంతమైన పదాలే అద్భుత భాషా సౌందర్యాలు
నిర్మాణాత్మకమైన ఆలోచన కవికి కావాలి
ప్రజా హితమే కవిత్వపు నడక కావాలి
కలం పట్టిన కవివరుడా మేలుకో

మంచిని పంచే ప్రతి కవితా ఒక వేదం
అక్షరమే సమాజానికి ఒక దివ్యమైన తోడ్పాటు
కవితా లక్ష్యం కేవలం అలరించడమే కాదు
మార్పును కోరుతూ పయనించే ప్రవాహం

నిరంతరం కవిత్వం ఒక బాధ్యత
వ్యామోహం వదిలి వాస్తవం పలికే కవితకు
నిత్యం జేజేలు పలికే ధరణిన.

అక్షర గమనం సాగాలి కడవరకు
సమాజ ప్రగతి కోరే కవి కీర్తి వరకు
కవిత్వం ఒక వెలుగు రేఖ కావాలి
లోకపు అంధకారాన్ని పారద్రోలాలి



-డా. చిట్యాల రవీందర్
7798891795

## గుండె మొగ్గ

ప్రతీ ముఖమూ
ఓ పూజా పుష్పమే, పరిమళ పుష్పమే, ప్రసాద పుష్పమే !
పూల కుప్పలు
పేర్చుకు రావాలి కానీ
ప్రేతాల పోగులు అలంకరించ కూడదు !.
అయిదేసి అయిదేసి వేళ్ళతో
అరచేతులు మొగ్గల్లా మారుతుంటాయి
అక్షరాలు కూడా
రకరకాల మొగ్గల్లా పరీమళిస్తుండాలి !
బహు వచనపు భాషా మాలలు
బహు దేవతల మెడలని చుట్టుకుంటూ ఉండాలి !.
చివరి వాక్యం ఓనమాలప్పుడే
కంఠతా వచ్చే జాతివరణం కూడిన నేల ఇది !
పరాయి గిరాయి పదాల ఉపాదుల మోజుతో
అరిషడ్వర్గాల అపచారానికి పూనుకుంటుంది ప్రాపంచికం!.
వృక్షాలకి వేర్లున్నట్లే
మనుషులకి కూడా మూలాలేర్పాడుతాయి
ఇల్లూ, నేలా, భాషా రూపాల్లో !
మనిషి మనసు,,మనిషికి మహా కష్టమైన క్రియ !
వేకువ కిలకిలారావాల ఊహల తో కాకుండా ఉదయాలన్నీ
బాంబుల విషవాయువులతో ఊపిరులని ఆపేస్తున్నాయి !
దేహాల దేశం కాదు లోకమని
నిత్య హరిత చేతనా పత్రాలది ప్రపంచమని
పూలపత్రాల పూల పాన్పులు మాట్లాడుతున్నాయి
పారిజాతాల మనసులతో !

-ఒబ్బిని
9849558842



**పేస్ బుక్ "అమరావతి సాహితీ మిత్రులు " వాట్సప్ గ్రూపులో డా॥ రావి రంగారావు నిర్వహిస్తున్న వారం వారం కవిత్వం వర్క్ షాపులో ఈ వారం కథల వర్క్ షాప్ లో విజేత పేర్లి దాసు కథ "మనసు పొరలు" నేటినిజం పాఠకుల కోసం ప్రత్యేకం.**

-సంపాదకులు

-డా॥రావి రంగారావు
9247581825

## మనసు పొరలు

రఘురామయ్య గారికి ఆ రాత్రి అన్నం ముట్టుకోబుద్ధి కాలేదు. గదిలో అటు ఇటు తిరుగుతున్నారు. బయట వాన కురుస్తోంది, కానీ ఆయన మనసులో అంతకంటే పెద్ద సుడిగాలి వీస్తోంది. తన ఒక్కగానొక్క కొడుకు సాకేత్, వేరే కులం అమ్మాయిని ఇష్టపడుతున్నానని చెప్పడమే ఆ కలతకు కారణం.

పక్కనే కూర్చున్న భార్య జానకమ్మతో ఆయన తన ఆవేదనను వెళ్లగక్కారు. "చూడు జానకీ.. ముప్పై ఏళ్లుగా ఈ ఊళ్ళో తల ఎత్తుకుని బతికాను. కులం అంటే మన కట్టుబాటు, మన వారసత్వం. రేపు ఏ శుభకార్యం జరిగినా మన వాళ్ల ముందు నేను ఏ మొహం పెట్టుకుని నిలబడాలి? 'మీ వాడు తక్కువ కులం పిల్లను తెచ్చుకున్నాడు' అని వాళ్లు వేలెత్తి చూపిస్తుంటే, ఆ అవమానం నేను భరించలేను. వాడు మన పరువును గంగలో కలుపుతున్నాడు."

జానకమ్మ నిట్టూర్చింది. "పరువు అంటే కులమేనా అండి? రేపు వాడు మనకు నచ్చిన పిల్లను చేసుకుని, సంతోషంగా లేకపోతే అప్పుడు వచ్చేది పరువా? మన అబ్బాయి సంతోషం ముఖ్యం కాదా?"

"నీకు అర్థం కాదు జానకీ.. పెళ్లి అనేది ఇద్దరు వ్యక్తుల మధ్య కాదు, రెండు కుటుంబాల మధ్య జరిగేది. రేపు మన ఆచారాలు, మన ఇంటి పద్ధతులు ఆ అమ్మాయికి ఎలా అర్థమవుతాయి? మన వంశ గౌరవం ఏమవ్వాలి? "రేపు వీరికి పుట్టబోయే పిల్లల భవిష్యత్తు ఏమిటి? ఏ కులం అని చెప్పుకోవాలి? రేపు వాళ్ళ పెళ్లిళ్లప్పుడు ఈ సమస్య మళ్ళీ మొదటికి రాదా?" ఆయన గొంతులో భయం, పంతం రెండూ వినిపిస్తున్నాయి.

కొన్ని రోజులు గడిచాయి. సాకేత్ తన నిర్ణయానికి కట్టుబడి ఉన్నాడు. ఇంట్లో మాటలు తగ్గిపోయాయి. ఒకరి ముఖం ఒకరు చూసుకోవడం కూడా కష్టమైపోయింది. ఒకరోజు సాయంత్రం రఘురామయ్య గారి ప్రాణమిత్రుడు శివరామ్ గారు వచ్చారు. శివరామ్ గారి కొడుకు తన కులంలోనే, పెద్దలు కుదిర్చిన పెళ్లి చేసుకుని, ఇప్పుడు తల్లిదండ్రులను వృద్ధాశ్రమంలో వదిలేసి విదేశాల్లో ఉంటున్నాడు.

శివరామ్ గారు కన్నీళ్లతో చెప్పారు, "రఘురామ్.. కులం చూసి, పరువు చూసి కోట్లాది రూపాయలు కట్నం చూసి పెళ్లి చేశాను. కానీ నా కొడుకులో కొంచెం కూడా మానవత్వం లేదు. ఇవాళ నేను ఒంటరిగా, అనారోగ్యంతో పడి ఉన్నాను. రక్తం పంచుకు పుట్టినవాడే మనల్ని వదిలేసినప్పుడు, ఈ కులం వచ్చి మనకి అన్నం పెడుతుందా? పరువు ఇస్తుందా? మనిషికి కావాల్సింది మానవత్వం, ప్రేమ, సంస్కారం, కులం కాదు రఘురామ్. నా మనుమలకి నా కులం పేరు ఉంది కానీ, తాత దగ్గర ఉండాలనే సంస్కారం, తాతను పలకరించాలనుకునేసద్బుద్ధి వాళ్లకి అబ్బలేదు."

ఆ మాటలు రఘురామయ్య గారి గుండెలో బాణంలా దిగాయి.

అదే సమయంలో ఆయనకు సాకేత్ రాసిన ఒక ఉత్తరం దొరికింది. అందులో సాకేత్ ఇలా రాశాడు:

"నాన్న.. మీరు పెంచిన క్రమశిక్షణలోనే నేను పెరిగాను. నేను ఎంచుకున్న అమ్మాయి మీ గౌరవాన్ని తగ్గించదు, దాన్ని రెట్టింపు చేస్తుంది. మీరు నాకు నేర్పిన విలువలే తనలోనూ ఉన్నాయి. నాకు కులం కంటే మీ చేతి స్పర్శ, మీ ఆశీర్వాదమే ముఖ్యం. మాకు పుట్టబోయే పిల్లలకి మేం ఇచ్చే ఆస్తి కులం కాదు నాన్న.. మీరు మాకు నేర్పిన మానవత్వం, సంస్కారం. రేపు మా పిల్లలు సమాజంలో ఏ కులం అని కాదు, మంచి మనసున్న మనుషులుగా ఎదగాలని కోరుకుంటున్నాను. మీ పరువు కోసం నన్ను నేను చంపుకోలేను, అలాగని మిమ్మల్ని వదులుకోలేను. మీరు అంగీకరించేవరకు పెండ్లి చేసుకోను"

ఆ ఉత్తరం చదువుతుంటే రఘురామయ్య గారి కళ్లలో నీళు తిరిగాయి. ఆయనకు అర్థమైంది.. సమాజం అనే అద్దంలో తనని తాను చూసుకోవడంలో పడి, కొడుకు నిజమైన ప్రేమను చూడలేకపోతున్నానని. బయట సమాజం ఇచ్చే పరువు కంటే, ఇంట్లో ఉండే మనుషుల మధ్య ఉండే ప్రేమే గొప్పదని ఆయనకు జ్ఞానోదయం అయ్యింది. పిల్లల భవిష్యత్తు అంటే కుల ధ్రువీకరణ పత్రాలు కాదని, అది వారు నేర్చుకునే సంస్కారమని ఆయన గ్రహించారు.

మరుసటి రోజు ఉదయం, సాకేత్‌ను దగ్గరకు పిలిచారు. పక్కనే జానకమ్మ కూడా ఉంది.

"సాకేత్.. ఇన్నాళ్లూ నేను కులం అనే ఇనుప గోడల మధ్య బందీగా ఉన్నాను. కానీ శివరామ్ పరిస్థితి చూశాక, నీ ఉత్తరం చదివాక అర్థమైంది.. మనుషుల్ని కలిపేది సంస్కారం, ప్రేమ మాత్రమేనని. కులమనేది మనం గీసుకున్న గీత, కానీ మానవత్వం అనేది దేవుడు ఇచ్చిన నిరంతర ప్రవాహం. నీ ఇష్టమే నా ఇష్టం. రేపు ఆ అమ్మాయి ఇంటికి వెళ్లి నేనే మాట్లాడుతాను. మీ పిల్లలకి తాతగా కుల భేదాలు లేని గొప్ప సంస్కారాన్ని నేనే నేర్పిస్తాను. ఆ అమ్మాయిని మన ఇంటి మహాలక్ష్మిగా ఆహ్వానిద్దాం."

రఘురామయ్యగారి మనసులోని పాత పొరలు విడిపోయాయి. పరువు అంటే పదిమంది ముందు ప్రదర్శించేది కాదు, మనసులో ఉండే నిశ్చలమైన తృప్తి అని ఆయనకు ఆ క్షణం తెలిసొచ్చింది. హాల్లో ఉన్న తాత,

ముత్తాతల పటాల వైపు చూశారు..

ఇప్పుడు అవి నిందిస్తున్నట్టు కాకుండా, ఆశీర్వదిస్తున్నట్టు అనిపించాయి.



-పేర్లి దాసు
9963249775

## గోవా కడలి తీరాన శతాధిక తెలుగు కవితా కేళి




డా॥ బండారు సుజాతా శేఖర్ రచించిన 'మట్టి గీతం' దీర్ఘ కవిత ఆవిష్కరణలో కంటె అశోక్, గంజి జగన్‌బాబు, డా॥ బండారు సుజాతా శేఖర్ దంపతులు, అంబల్ల జనార్ధన్ తదితరులు.

హైదరాబాద్, మే 27:మే 19 నుండి 21 వరకు ఏ.కే. తెలుగు మీడియా, ఎఫ్. టామ్ (మహారాష్ట్ర తెలుగు సంఘాల సమాఖ్య) మరియు ముంబయి భారతి సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో "గోవా కడలి తీరాన శతాధిక తెలుగు కవితా కేళి" కార్యక్రమం నిర్వహించారు. మహారాష్ట్ర, గోవా, తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్, కర్ణాటక. తమిళనాడు మరియు ఒడిషా, మొత్తం ఏడు రాష్ట్రాలకు చెందిన కవులు, కళాకారులు చురుకుగా పాల్గొని కార్యక్రమం దిగ్విజయం చేశారు.

మే 19న సాయంత్రం ఏడు గంటలకు, హోటల్ సభాస్థలిలో డా. బండారు సుజాతా శేఖర్ వాగ్దేవి స్తుతితో కార్యక్రమం మొదలయింది. ఆ తర్వాత వారు రచించిన దీర్ఘ కవితా సంపుటి "మట్టి గీతం" యొక్క "సుదూర గమ్య ఆవిష్కరణ మహోత్సవం" తో కార్యక్రమం ముందుకు సాగింది. ఆ కార్యక్రమానికి గంజి జగన్ బాబు అధ్యక్షత వహించగా, శ్రీకాకుళం జిల్లా డిప్యూటీ కలెక్టర్, కవయిత్రి శ్రీమతి తులాల నవరమ్మ , ముఖ్య అతిథిగా



గోవా గవర్నర్ గౌ॥ అశోక్ గజపతిరాజుకు పుస్తకాన్ని అందజేస్తున్న అంబల్ల జనార్ధన్ తదితరులు.

హాజరయ్యారు. గోవా నివాసి మురళీధర్ కొచ్చెర్ల, గౌరవ అతిథిగా, ఏ.కే. తెలుగు మీడియా సంస్థాపక అధినేత శ్రీ కంటె అశోక్, ముంబయి భారతి అధ్యక్షులు డా॥ అంబల్ల జనార్దన్ గారు వేదిక నలంకరించారు. శ్రీమతి తులాల నవరమ్మ మరియు డా॥ అంబల్ల జనార్దన్ గార్లు దీర్ఘ కవితా సంపుటి "మట్టి గీతం" సంయుక్తంగా ఆవిష్కరించారు. శ్రీమతి తులాల నవరమ్మ గారు మాట్లాడుతూ...ఈ కవితా సంపుటి ఆవిష్కరించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. అలాగే వివిధ రాష్ట్రాలనుండి వచ్చిన అంత మంది తెలుగు వారిని కలుసుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. గ్రంథ ఆవిష్కర్త డా. అంబల్ల జనార్దన్ దీర్ఘ కవితా సంపుటిని పరిచయం చేస్తూ, పాతిక సంవత్సరాల క్రితం ముంబయిలో తను, డా.ఎన్.గోపి గారి "జలగీతం" మరాఠీ అనువాద సంపుటి పరిచయం చేసిన సందర్భం జ్ఞప్తికి తెచ్చుకున్నారు. డా. గోపి పంచభూతాల్లో ఒకటైన నీటిపై కావ్యం రాస్తే, డా. సుజాత గారు మరో పంచభూతమైన "మట్టి గీతం" రాయడం ఎంతో ముదావహం అని కొనియాడారు. మట్టి, మానవ మనుగడకై తోడ్పడే విధానం, దానిలోని తాత్వికత, దాని పరిధి, మొదలైన వాటిపై కావ్యంలోని కొన్ని కవితా పంక్తులు చదివి వివరించారు. ఒక ప్రయోజన కరమైన "మట్టి గీతం" రచించిన కావ్యకర్త డా. బండారు సుజాతా శేఖర్ అభినందించారు. గౌరవ అతిథి, గోవా నివాసి మురళీధర్ కొచ్చెర్ల మాట్లా డుతూ, గోవాలో అంత మంది తెలుగు వారిని కలుసుకోవడం ఆనందంగా ఉందన్నారు. శాస్త్రజ్ఞులైన వారు, ఒక పాట కూడా ఆలపించారు. దాచేపల్లి బుచ్చయ్య గారి వందన సమర్పణ తో ఆ కార్యక్రమం ముగిసింది.




డా॥ అంబల్ల జనార్ధన్‌ను సత్కరిస్తున్న అతిథులు

ఆ తర్వాత శతాధిక కవి సమ్మేళనం జరిగింది. హాజరైన కవులు, తమ కవిత లతో అందరిని అలరించారు. కొందరు గోవా ప్రకృతిని వర్ణిస్తే, కొందరు తెలుగు భాష ఔన్నత్యంపై, కొందరు ఛందోబద్ధ కవితలు ఆలపించారు. అందరు కవులను నిర్వాహకులు "గోవా కడలి కవి రత్న" పురస్కారంతో పాటు, శాలువా, జ్ఞాపిక, డా.అంబల్ల జనార్దన్ గారి కథానికా సంపుటి "ప్రాణధార", డా. బండారు సుజాతా శేఖర్ గారి దీర్ఘ కవితా సంపుటి "మట్టి గీతం" తో సన్మానించారు. అంతే కాదు, కార్యక్రమ సమన్వయ కర్తలు గంజి జగన్ బాబు, కంటె అశోక్ గార్లను "గోవా కడలి సమన్వయ రత్న" పురస్కారంతో సన్మానించారు. అలాగే దీర్ఘ కాలంగా గోవాలో ఉంటూ సమాజ సేవ చేస్తున్న ఆరుగురు తెలుగు సంస్థల పదాధికారులను "గోవా కడలి సేవా రత్న" పురస్కారాలతో సత్కరించారు.

20వ తేదీన మన తెలుగు వారైన గోవా గవర్నర్ గౌ. అశోక్ గజపతి రాజు గారు ఆ బృందానికి ఆత్మీయ విందుతో గోవాకు స్వాగతం పలికారు. ఎంతో మంది తెలుగు వారున్న గోవాలో ఒక "తెలుగు భవన్" కి ప్రభుత్వం భూమి కేటాయించాలనే మా విన్నపానికి సానుకూలంగా స్పందించి, స్థానిక ప్రభుత్వానికి శిఫారసు చేస్తానన్నారు.

ఆ సందర్భంగా డా. అంబల్ల జనార్దన్, డా. బండారు సుజాతా శేఖర్, శ్రీ జక్కని గంగాధర్, శ్రీమతి లతా తేజేశ్వర్ 'రేణుక' గార్లు, తాము రచించిన పుస్తకాలను గౌ. గవర్నర్ గారికి సమర్పించారు.

ఆ తర్వాత కవులందరుగోవాలోని కొన్ని ప్రేక్షణీయ స్థలాలను, మందిరాలను, సందర్శించారు.

21వ తేదీన ఉత్తర గోవాలోని ఒక సముద్రంలో ఓ గంట, ఓడ ప్రయాణంలో, తీరాల్లోని ఐదు ప్రేక్షణీయ స్థలాలను వీక్షించారు.

మొత్తం మీద ఆ బృందం, గోవా సందర్శనలో ఎన్నో మరుపురాని జ్ఞాపకాలను మూటగట్టుకొని, అంత మంచి అవకాశం కల్పించిన నిర్వాహకులకు ధన్యవాదాలు తెలిపారు.



## శునకోపాఖ్యానం...!

కుక్కలు విశ్వాసానికి ప్రతీక
మానవాళికి అలవాటుపడిన
శునకాలు గ్రామసింహాలై
వెలుగొందాయ్యి నాడు!.
మనుష్యులతో సహవాసానికి
మరిగిన కుక్కలు మొరగడం
కరవడం నైజం సహజమే!
కుక్కలకు చెప్పులే ఆశ!
ప్రేమ పెంపకంతో
"మాఇంట్లో కుక్కుంది జాగ్రత్త!"
అనే బోర్డ్ లు వెలిసాక
మొత్తంమీద తగిన జాగ్రత్తలు
తీసుకుంటే కుక్కలు
నమ్మకాని వమ్ము చేయలేదు
పెంచుకోవడం...
కొన్ని కుటుంబాలలో అనివార్యం
గొర్ల కాపాలాలో
తమ విధ్యుక్తధర్మం
నిర్వహిస్తూకనురెప్పలా
కాపాడుతున్నాయ్!.
ఈ మధ్యకాలంలో
వాటికి కొంతమంది
దానవ మనుషుల లక్షణాలున్న
గుణ గణాలకు
అలవాటు పడ్డాయేమో
కొందరి
దుర్మార్గ మానవుల నైజాలు
వంట బట్టాయాయేమో
వీధుల్లో స్వైరవిహారం
చిన్నపిల్లల శరీరాలను
జీవితాలను ముక్కలు
ముక్కలుగా చేస్తూ
తింటూ దర్జాగ తిరుగుతూ
ఇష్టారాజ్యంగావెళుతున్నాయ్!
చిన్న పెద్ద లేకుండా కరుస్తూ
కాట్లతో దాడి చేస్తున్నాయ్!
ప్రాణాలపై అఘాయిత్యాలకు
పాలుపడుతున్నాయి!
చంపిముక్కలుచేస్తున్నాయ్!!
బయట వీటిని చూసి
మానవాళి
భయకంపితులౌతున్నారు!
అడవి సింహాలే నయం
"జూ"కెళ్ళినప్పుడు చూస్తాం
భయమేమివుండదు.
కుక్కల ధాటికి జనాలు
హడలిపోతున్నారు!
వీటివల్లవున్న
అభద్రతాభావం తొలిగిస్తే
నేరస్తులనుపసిగట్టె
జాగిలాలవలె పెంచితే
కాస్తా ఉపశమనం కల్గుతుంది.
మానవాళికి
కల్లాకపటం తెలియని
బాలబాలికలకు
ప్రశాంతత దొరుకుతుంది...!!!



-డా. గన్నోజు
శ్రీనివాసాచారి
8555899493

## నిత్యనూతన శాస్త్రం

సృష్టికి మూలం వైజ్ఞానికం !
అంతులేని రహస్యాలను ఛేదించే నిత్యనూతన
శాస్త్రం !
సహేతుకంగా
వివరించేదే ఈ శాస్త్రం
వ్యవస్థల ప్రక్షాళనకు
అవస్థల నివారణకు
సకల సమస్యలకు
పరిష్కారం మన వైజ్ఞానికం.
వైజ్ఞానికదినోత్సవ శుభాకాంక్షలతో..



-గరిమెళ్ళ కాశీఅన్నపూర్ణ
9618586277

## సెలవుల్లో బడి





వేసవి సెలవుల్లో..
పిల్లలందరూ రెక్కలొచ్చిన పక్షులై
గుంపులు గుంపులుగా
ఆనందాలు వెదుక్కుంటూ ..,
తరగతి గదుల చేతులు ఆడక,
మైదానం కాళ్లు పరిగెత్తక,
గంట నోరు మోగక,
గోడల చెవులు సందడి వినక,
నల్లబల్ల నుదురు ఏ రాతలు నోచుకోక,
కిటికీల కళ్ళు తెరవక,
దేహం దేహమంతా స్తబ్ధమైపోయినట్లు..
బడితల్లి ఒక్కతే,
వదిలేసిన పిల్లలను
తలుచుకుంటూ
ఒంటరిగా..దిగాలుగా,
తూర్పు గేటు వైపు ఎదురు చూపులను
ఆరేసుకుంటూ..!!



-డా. కాసర్ల నరేష్‌రావు
9441406252

## జీవన ప్రయాణం

రోడ్డు నువ్వు అనుకున్నట్లుగా ఉండదు..
రోడ్డు సాఫీగా ఉంటే నువ్వేమిటి..
చంటోడు కూడా గమ్యం చేరతాడు
వంకలు, స్పీడ్ బ్రేకర్లు ఎన్నో ఉంటాయి
వాటికి నీ అనుమతి అవసరం లేదు
రహదారి ఎలా ఉంటే ఏమి..
మనం దాటగలమనే ధైర్యం ఉండాలి
అందరికీ రోడ్డు ఒక్కటే..
కాని ఎవరి ప్రయాణం వారిదే..
ఎవరి వేగం వారిదే
అనుకున్న గమ్యాన్ని చేరడానికి..
ఎక్కువ సమయం తీసుకోకు
పోటీలో చాలా మంది ఉన్నారు
తొందరగా చేరడానికి ప్రయత్నించు..
అలాగని ప్రమాదాలు కొనితెచ్చుకోకు
వంకరటింకరగా, రద్దీగా, గుంతలుగా..
ఉందని ప్రయాణం ఆపకు
తోచుకుంటూ, అధిగమించుకుంటూ..
గుంతల్ని చాకచక్యంగా దాటుకుంటూ..
వంకల్ని వయ్యారంగా తప్పించుకుంటూ..
సురక్షితంగా, త్వరగా గమ్యం చేరు
ప్రథమ స్థానంలో ఉంటేనే ఫలితం



-మధుపాళీ
9949700037

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక, దర్పణం సాహిత్య వేదిక సంయుక్తంగా ప్రతిరోజూ ఒక అంశం ఇచ్చి కవిత్వ రచన చేయిస్తున్నాయి. కవిత్వాన్ని నిరంతరం సాధన చేయిస్తున్నాయి. కవులు రాసిన పద్యాలు, వచన కవితలు, గేయాలను విశ్లేషించి; మెరుగు పరచుకోవడానికి ప్రతిరోజూ సూచనలు, సలహాలు ఇవ్వడం జరుగుతోంది. ఈ దైనందిన కార్యక్రమంలో భాగంగా 1767వ రోజు 'మేనమామ' అనే అంశంపై పలువురు కవులు తమ కవితలను పంచుకున్నారు. కవితల సాధన చేస్తున్న కవులందరికీ అభినందనలు. 'మేనమామ' అంశంపై వచ్చిన కొన్ని కవితలను 'నేటి నిజం' పాఠకుల కోసం ప్రత్యేకంగా అందిస్తున్నాం.
-సంపాదకులు

***మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక & దర్పణం సాహిత్య వేదిక వాట్సాప్ సమూహం***

అడ్మిన్ & ఏకాంశ కవిత్వ నిర్వహణ:

**-డా॥రాయారావు సూర్యప్రకాశ్‌రావు, 9441046839**



## పుట్టింటి చందమామ

అమ్మ మేను
మామ మేను
కలిసి పంచిన రక్త బంధం
పుట్టింటి అనుబంధం
మేను సంబంధం
అనురాగ బంధం.
పుట్టినప్పటి నుండి
ముద్దులతో ముంచెత్తి
పెళ్లి సంబరాల్లో గంపను తానెత్తి
బాధ్యతలో మునిగి తేలుతూ
ఆడబిడ్డకు అండ
బలం కొండంత!!.
కష్టసుఖాల్లో వెన్నుదన్ను
కన్నీటిని తుడిచి
కుటుంబాన్ని ఒక తాటిన నిలబెట్టే
నైపుణ్యం.
చిన్నపుడు గుండెమీద తన్నినా
గుండెల్లో పెట్టుకుని
కంటికి రెప్పలా కాపాడే మామ
బాధలో చేయూత నిచ్చే ధీమా.
మేనమామతో పెళ్లి
ఆరోగ్యానికి చిల్లి
వివాహంతో భావితరానికి
లోపం వచ్చే వారధి
జాగ్రత్తగా ఉంటే మంచిది
అమ్మ-మామ ఒకే రక్తం
అందుకే 'మేను'మామ
పుట్టింటి చందమామ!!.

**-డా.చీదెళ్ళ సీతాలక్ష్మి**

## బాధ్యత ఎరిగిన బంధం

ఒకే రక్తం పంచుకొని
పుట్టిన తోబుట్టువులు
మర్చిపోని
మార్చురాని
విడి పోకూడని బంధాలివి.
అక్క చెల్లెళ్ళకు బతుకు భరోసా
అత్తారింటికి సాగనంపే
తోబుట్టువు
చీర సారెలతో
సంప్రదాయ సంస్కృతుల రక్షణ.
తొలిచూరు మలిచూరు కాన్పులు
పుట్టింట్లో పురుడు ఆనవాయితీ
పుట్టిన బిడ్డ తలరాత
తల్లిదండ్రులకే కాదు
మేనమామకూ
ఉంటుంది కొంచం
పుట్టిన వెంటనే
అమ్మమ్మ తాతతో పాటు
మేనమామ చూస్తాడు
తండ్రి కన్నా ముందు.
అక్క, చెల్లెళ్ల బిడ్డల విషయంలో
కన్నోళ్లకన్నా మేనమామ
బాధ్యతలెక్కువ
బాధ్యత ఎరిగిన మేనమామ
మంచి చెడులను చూస్తూ
మంచి మార్గం నడిపిస్తారు
చదువు సంస్కారం నేర్పుతూ
బతుకు బాటలు వేస్తారు
ఆడ పిల్లలకైతే ఎదిగిన కొద్దీ వెంట
ఉండి
పుట్టినీటి నుండి అన్నీ
సారె సంబరం నుండి
పెళ్లి పేరంటం వరకు
అన్నీ సమకూరుస్తారు
అన్ని బాగోగులు చూస్తారు
అన్నీ సర్దుతూ
సమయస్ఫూర్తితో
వెన్నంటే ఉంటారు.
మేనమామంటే
తల్లిదండ్రుల కన్నా ఎక్కువ ఇష్టం
తల్లిదండ్రులకు చెప్పుకోలేనివి
మేనమామ దగ్గర విప్పే గుట్టు
బాధ్యత ఎరిగిన మేనమామతో
బంధాలు పదిలం
తోబుట్టువు వందేళ్లు సౌఖ్యం.
పెట్టినా పెట్టకపోయినా
మేనమామ
పేరుకైనా ఉంటే చాలు
అదే భాగ్యం.

**-పొన్నాల ధనమ్మ**

## మేను బంధం

మేను కలిసి
అమ్మతో పాటు పుట్టినవాడు మేనమామ
ముద్దుల మామయ్య
అమ్మలా లాలించేవాడు
అడిగిందల్లా ప్రేమతో తెచ్చిచ్చేవాడు
అమ్మ పుట్టిల్లు మేనమామ దగ్గరా
మా అమ్మ చెప్పే సామెత
పుట్టింటి విషయాలు
మేనమామకు తెలియకపోతే ఎలా!!.
అందరికీ ఉన్నాడు ఒక మామ
అతడే చందమామ
చిన్నపాపకు
గోరుముద్దలు తినిపించాలంటే
ఈ మామను పిలవాల్సిందే మరి!!.
పిల్లలను ఒంటరి చేసి
కాలం చేసిన తండ్రి
తండ్రిలాగా
బాధ్యతలు తలకెత్తుకునే మామయ్య
సోదరి పిల్లల బాగోగులు చూసుకునే
మేనమామ
పితృ సమానుడు!!.
పెళ్లికూతురు అయిన
మేనకోడలి పెళ్లి గంపను
ఆనందంగా మోసేవాడు
పెళ్లి తంతు అంతా
దగ్గరుండి బాధ్యతతో నడిపించేవాడు!!.

**-పరిమి వెంకట సత్యమూర్తి**

## చెరగని ముద్ర

ఎంతమంది దగ్గరి బంధువులున్నా
ఎవరి స్థానం వారిదే
ఎవరి గొప్పదనం వారిదే
మేనమామలంటే
ఇష్టముండని వారెవరూ ఉండరు
మేనమామలకు
మేనల్లుళ్లూ మేనకోడళ్లూ
అంటే ఆప్యాయత
వారితోడ అమ్మ ఒక్కతే ఉండి
మనమూ ఒకరిద్దరమే ఉంటే
మనపై ఆ ప్రేమలూ
అభిమానాలే వేరు
అమ్మపై అనురాగంతో
ప్రతి పండుగకూ పిలిచి
చీర సారెలిచ్చి ఊరంతా తిప్పి
ఆయా సీజన్లలోని పండ్లన్నీ తెచ్చి
మనలను
రాకుమారుడిలా, రాకుమారిలా చూసేది
మేనమామ గాక ఎవరు?
మా పెద్ద మేనమామ
నా చిన్నప్పుడు నాతో చదివించి
మెచ్చుకొని డబ్బులిచ్చిన జ్ఞాపకం
ఇంకా నా మదిలో చెరగని ముద్రనే

**-నాగిరెడ్డి అరుణ జ్యోతి**

## నాన్నలా...

అమ్మ తోబుట్టువు
రక్తసంబంధం
పుట్టినప్పటి నుంచీ మామ పిలుపు
మాటలతో ఆటపాటలతో
మింట చందమామ
ఇంట మేనమామ.
గాంధారి సోదరుడు
శకునితో కౌరవుల బంధం వినాశనం
మాద్రి సోదరుడు
శల్యుని సారథ్యంలో కర్ణుని పతనం
కృష్ణుని మేనమామ
కంసుడికి అనునిత్యం భయం
అభిమన్యుని మేనమామగా
కృష్ణుని ప్రేమాప్యాయతలు లోక విదితం
పరీక్షిత్తుని కాపాడిన
వాసుదేవుడు వంశరక్షకుడాయె.
సోదరిపిల్లలకి
అన్నప్రాసనతో మేనమామ సంబరం
పుట్టువెంట్రుకలు
ఒడుగు నాడు మేనల్లుడి జుట్టు కత్తిరింపు
ఓణీ, ధోతి సంప్రదాయంలో
మామ, ఆయన భార్యదే పెత్తనం.
వధువుని పెళ్లి బుట్టలో మోసి
మంటపం లోకి తెచ్చే
మేనమామ పై బరువు బాధ్యతలు
వితంతు సోదరి సంసారానికి
ఆమె పిల్లల భవితకు
త్యాగమూర్తిగా అవతార మెత్తు మామ
వెన్నెల బాట పరిచే చందమామ.
అమ్మ పుట్టిల్లు మేనమామ కెరుక
కోయవద్దు సొరకాయ కోతలు
మేనమామ చెవిలో వెంట్రుకలు
మొలిపించు మని కోరిన అమాయకుడు!!
అదృష్టం కల్పిస్తుందనే
నమ్మకం హాస్యాస్పదం.
అక్కన్న మాదన్న మేనమామలు
గోల్కొండ కోటలో అధికారులు
భక్త రామదాసుకి తప్పు లేదు చెర
అన్నమయ్య భార్యలు మేనమామ కూతుళ్లు
భక్తి ముక్తికి సోపానాలు.
మేనమామ తో పెళ్ళి
ఒకప్పటి సంప్రదాయం
నేడు ఒకేఒక్క సంతానంతో
మేనమామ, మేనత్తలు లేక
అందరూ ఆంటీలు, అంకుల్
పిలుపుల మాయాజాలం
ఆనాడు ఆడ మగ పిల్లలకి
పుట్టుకతోటే మేనరికం
నేడు వధువులు దొరక్క
"మామా! చందమామా!
ఏడనుందో నా భామ" అంటూ
భూమాతకు ముద్దుబిడ్డ
ఆకాశపు జున్నుగడ్డతో పాటలతో
వృధ సొదల విరహగీతాల కుర్రకారు.

**-ఎ.రాజ్యశ్రీ**

## తండ్రి తర్వాత తండ్రి

అందరికీ మామలెందరో
అబ్బాయి మామలు
రామలక్ష్మణులు.
రామలక్ష్మణుల వంటి
మామలు కలిగితే
రాకపోకలు ఎల్లకాలమ్ము.
చిలకల్లు చెలరేగి
జీడి కొమ్మెక్కు అమ్మాయి
జలరేగి మామ భుజమెక్కు
మామ భుజమెక్కితే ఏమేమి
అడుగు
పాల్దాగు గిన్నెడుగు
పాడావునడుగు.
పదిమందికి తక్కువ కాకుండా
కన్న సంతానంలో కొందరయినా
మేనమామలుండకపోతారా?
అందుకే ప్రతి ఇంట
ప్రతినోట ఈ పాట
ఉయ్యాల లూపేవేళ వినిపించే
జోల పాట ఒకప్పుడు.
భారతీయ సంప్రదాయంలో
మగ బిడ్డ స్థానం ప్రముఖం
అంబరీషోపాఖ్యానంలో
భగవంతుడెలా భక్తుని
వెనక వస్తాడో చెప్పే సంఘటనలో
"గోవు వెనక తగులు కోడె భంగి"
అంటాడు పోతన.
తల్లి వెనక పిల్లవాడివలె
భగవంతుడు భక్తుని వెనక
వస్తాడని
చెప్పే ఉపమానంలో
మగ బిడ్డ ఆవశ్యకత
పోతన మాటల్లో.
మేనమామ- కన్న తండ్రి
ఒకటని సామెత.
పుత్ర సంతానం కోసం
తాపత్రయాని కారణమదే
ఇటు తల్లిదండ్రులకు
అటు ఆడపిల్లలకు
ఇంట్లో ఎంతో అండ దండ
ఈ మగ బిడ్డ.
ఏ శుభకార్యమైనా
మేనమామ రావాల్సిందే
వస్త్రాలు చదివింపులు
తేవలసిందే.
పుట్టింటి ఆస్తి కోసం
నేడు కుస్తీలు పట్టి
కోర్టు కెక్కే నారీమణులు
ఆస్తి తెచ్చుకున్నా
తెంచుకున్న సోదర బంధం
పిల్లలకు మేనమామ
మానస ప్రేమ సుగంధం
దూరంగావడం
ఎవరూ తీర్చలేని ఘోర శాపమే.
మేనమామ ఉంటేనే పుట్టిల్లు
స్త్రీలకు
లేకపోతే తల్లిదండ్రుల తర్వాత
ఆడ కూతుళ్లు
ఎవరికి వారే యమునా తీరే.
ఉంటే కంటికి రెప్పలా
కాపాడే మేనమామ ఉండాలి.
కత్తులు దూసే కంస మామలకు
చాప కింద నీళ్లలాంటి శకుని
మామలకు ఒక నమస్కారం.

**-డా.సి.వసుంధర**

## బంగారం

భరత జాతి గొప్పదనం
వివాహ కుటుంబ
నాగరిక కట్టుబాటు
జీవన సంస్కృతి సౌరభం
అమ్మ మూలం
అమ్మే దైవం
ప్రేమకు ప్రతిరూపం
ఆ రక్త సంబంధ మరో రూపం
అమ్మతనపు మేను
మేనమామ
అమ్మ తోబుట్టువు అనురాగం
బాల్యానికి దొరికిన స్నేహం
కష్టం వస్తే అక్కున చేర్చే ధైర్యం
గారాలు పోయినా
చీదరించని బంధువు
అమ్మ తరువాత అమ్మలా
తోడై నిలిచే దాపు
'మేనమామ' అనే పిలుపే
ఆత్మీయబంధురం
తండ్రి లేకపోతే
అమ్మకు తోడై
బాధ్యత మోసే బంగారం
మేనమామ
కుటుంబ వ్యవస్థలో
ప్రధాన పాత్ర మోసే మాణిక్యం.

**-జె.నరసింహారావు**

## ప్రీతిపాత్రుడు

తల్లితండ్రుల తర్వాత
అంతటి బాధ్యతతో
ఆప్యాయతగా చూసుకునే
అత్యంత ప్రీతిపాత్రుడు.
మేనమామ ఇంటికి వెళ్తే
పిల్లలకు సంతోషమే.
సెలవుల్లో వెళ్ళేది మేనమామ ఇంటికే
వివాహ సమయాల్లో
తలంబ్రాలు తీసుకురావడం
వధూవరులను
పీటల మీదికి తీసుకురావడం
అప్పగింతల సమయంలో
ప్రధాన పాత్ర వహించడం.
వేడుకలలో
వారి కోసం బట్టలు కొనడం.
అక్షరాభ్యాసం చేయించడం
బహుమతులు కొనడం
అన్నీ మేనమామ ఇష్టంగా చేసే పనులే
బంధువులలో అందరూ
ఎక్కువగా ఇష్టపడే వ్యక్తి మేనమామ.

**-డా.షహనాజ్ బతుల్**

## తేనెల సోన

అమ్మకు ముందో వెనుకో పుట్టి
అమ్మ గుట్టులన్నీ తెలిసిన మాని!
ఆత్మబంధువై మెలిగే అభిమాని!
చెల్లికి కష్టం రానీయని రక్షకుడు!
చెల్లి పిల్లలన్నా
అక్క పిల్లలన్నా
కురిపిస్తాడు వల్లమాలిన అభిమానం!
తన కూతురునిచ్చి మామ కావాలని ఆశ!
సోదరి సంతుకు వస్తాయి అతని గుణాలు!
మేనల్లుడు అంటే మామకెంతో ప్రేమ!
సోదరిని కాపాడుతాడు కంటికి రెప్పలా!
కంసునికి కృష్ణునిపై ఎంతో కసి!
కృష్ణుడికి అభిమన్యుడంటే ఎంతో ప్రీతి!
మేనమామకే అల్లుడయ్యే అన్నమయ్య!
అన్నప్రాసన చేసేది మేనమామే!
ఓణీ పండుగ చేస్తాడు మేనకోడలికి!
వధువుకు బుట్టలో తెచ్చేది మేనమామే!
వితంతు సోదరిని ఆదుకునేది మేనమామే!
ఏ ఇంట మేనమామ ఉంటాడో
ఆ ఇల్లే శత్రు దుర్భేధ్యమైన కోట!
మేనమామ మా పాలిట చందమామ!
చల్లని వెన్నెల నిచ్చే తేనెల సోన!!


**-కోలా సత్యనారాయణ**

## ఆత్మబంధువు

తోబుట్టువు సంతతికి
చనువైన ఆత్మ బంధువే మేనమామ
ఆ మట్టుకు ఏ మట్టుకు అనువైన
ఆలనాపాలనలో భాగస్వామి.
ప్రసవాలు పుట్టింట జరగటం
బిడ్డ నిలదొక్కుకునే వరకు
అరమరికలు లేని పుట్టింట పెరగటం
అమ్మమ్మ తాతయ్యలే కాక
మేనమామ ఎదలపైన నిద్రపుచ్చి
చనువుగా అనువుగా
మామయ్యా అని పిలువబడే
పాత్ర మేనమామ.
సెలవులకైతేనేం..పర్వాలకైతేనేం
మేనమామ ఇల్లంటే ప్రీతిదాయకం
అల్లర్లకి చిల్లర కోర్కెలకి
అడ్డు తాపు లేని స్థానం.
దగ్గర వయసున్న
మామా మరదల్ల సరసాలే
తెలుగునాట వినోదాల
ఉల్లాసాల సయ్యాట..సరసాలే పక్వమైతే
మనువాడే జంటల పంట.
శకునిలాంటి మేనమామలు లేకపోరు
పోతనలాంటి
లేతమనసుల వారూ లేకపోరు
మేనమామ చెవిలో
వెంట్రుకలు బాగా మొలిస్తే
మేనల్లుడు సంపదలతో విరాజిల్లు
అనే సామెత కొంతమేర సార్థకమే.
ప్రసిద్ధ చరిత్రల వెనుక
మేనమామ పాత్ర గుర్తుండిపోతుంది
రామాయణంలో
భరతుడు మేనమామ ఇంటికెళ్ళడం
భారతంలో శ్రీకృష్ణుడు
శల్యుడు- శకుని పాత్రల వలన
కథ అడ్డం తిరగటం
అందరికీ తెలిసిన విషయమే.
ఎవరికి ఎప్పుడు..ఎక్కడ ఎంత
గౌరవమియ్యాలో
యోచించి చేయాలి
మేనమామల విషయంలో కూడా
ఇదే వర్తిస్తుంది.

**-రాజప్ప**

# తెలుగు ప్రజలకు వరం సురవరం



అవి తెలుగు భాషను గుర్తించని, స్థానిక ప్రాంతీయ భాషకు విలువలేని, తెలుగు భాషలో చదువు కోవడానికి కూడా సౌకర్యాలు అంతగా లేని రోజులు. నిజాం పాలకుల నిరంకుశ పాలనలో సామాజిక చైతన్యం దాదాపు శూన్య స్థితిలో స్తబ్ధంగా ఉన్న సమయం. తెలంగాణ ప్రాంతంలో అధికార భాష ఉర్దూ మాధ్యమంలో చదువులు సాగడం, ఉర్దూ లోనే ప్రభుత్వ, వ్యావహారిక కార్యక్రమాలు కొనసాగడం, చదువుకున్న వారు ఉర్దూ చదవటం ఒక హోదా చిహ్నంగా ప్రజలు భావించే కాలం. అప్పుడు రాజభాషగా, పాలనా భాషగా, వ్యవహారభాషగా ఉర్దూ ఉండగా, ఉర్దూ భాషలోనే మీజాన్, జామీన్, రయ్యత్ పత్రికలు వచ్చేవి. అప్పటికి రెండు తెలుగు వార పత్రికలు మాత్రమే 'నీలగిరి' నల్లగొండ జిల్లా నుండి, 'తెలుగు' వరంగల్ జిల్లా నుంచి వెలువడు తుండేవి. అలాంటి నిజాం రాజ్యంలో, ప్రతికూల వాతా వరణంలో తెలుగు పత్రికని స్థాపించడమే ఓ సాహసం. ఉర్దూ, సంస్కృతం, మరాఠీ భాషలు రాజ్యమేలుతున్న నిజాం రాజ్యంలో తెలుగు సాహిత్యం నిలదొక్కు కునేందుకు 'గోలకొండ పత్రిక' బీజం వేసింది.

హైదరాబాద్ సంస్థానంలోని తెలుగు ప్రజల విజ్ఞానానికి తెలుగులో పత్రికను ప్రారంభించాలని నిశ్చయించారు. అంధకార బంధుర మైన నాటి పరిస్థితులలో గోలకొండ పత్రిక అనే చిరుదివ్వెను వెలిగించి తన బహుముఖ ప్రజ్ఞతో సంస్థలను, ఉద్యమాలను నిర్మించి, ప్రజల చైతన్యాన్ని తట్టిలేపే బృహత్తర కార్యక్రమం ప్రారంభించారు సురవరం ప్రతాపరెడ్డి. మాతృ భాషలో చదువుకొనే అవకాశాలు లేక అంతా ఉర్దూమయమై, నిజాం నిరంకుశ పరిపాలనలో, నిద్రాణ స్థితిలో ఉన్న తెలంగాణను జాగృతం చేయాలన్న సురవరం దీక్ష ఫలితమే...1926 మే 19న గోలకొండ పత్రిక ప్రారంభ నేపథ్యం. ఆ పత్రిక వారానికి రెండు మార్లు వెలువడు తుండేది. పత్రిక నిర్వహణలో ఎన్నో కష్టాలను ఎదుర్కొన్నారు. జాతీయ భావాలను ధైర్యంగా ప్రచారం చేశారు. 1947 లో అది దినపత్రికగా మారింది. నిజాంను తన పత్రికలలో ఏకిపారేస్తూ దూకుడుగా వ్యవహరించేవారు సురవరం. ఒక దశలో నిజాం రాజు గోలకొండ సంపాదకీయాలకు భయపడ్డారంటే... ఆయన కలం నిజాంను ఎంత కలవర పరిచిందో అర్థం చేసుకోవచ్చు.

పత్రిక ఆదర్శాలను గురించి వివరిస్తూ ప్రతాపరెడ్డి ఒక సంపాదకీయంలో... "మేము మా పత్రిక స్థాపన కాలం నుండియు రెండంశములు దృష్టి పథమందుంచు కొని దేశీయులకు సేవ చేయు చున్నాము. మొదటిది ఆంధ్రాభాషా సేవ, రెండవది జాతి, మత, కుల వివక్షత లేక ఆంధ్రులలో సర్వశాఖల వారి యొక్క సత్వరాభి వృద్ధికై పాటుపడుట".

ఈ ఆశయాన్ని నెరవేర్చేందుకే ప్రతాపరెడ్డి క్షణం విశ్రాంతి లేకుండా ఎనలేని కృషి చేశారు. గోలకొండ పత్రికకి సురవరమే సర్వస్వంగా ఉండేవారు. సంపాదకుడి దగ్గర నుంచి ప్రూఫ్ రీడరు వరకూ అన్ని బాధ్యతలూ నెత్తిన వేసుకుని పత్రికను నడిపించే వారు. గోలకొండ ప్రతాపరెడ్డి ప్రతిభకు అద్దం పట్టింది. తెలంగాణ ప్రజానీకాన్ని జాగృత పరచటంలో అద్భుత పాత్రను నిర్వహించింది. గోల్కొండ పత్రిక, దానికి అనుబంధంగా భారతి సాహిత్య పత్రిక, ప్రజావాణి పత్రికలను స్థాపించి పత్రికా సంపాదకుడిగా, రచయితగా సేవలు అందించారు. ఆయన రాసిన వ్యాసాలూ, పద్యాలూ, విమర్శలూ, సంపాదకీయాలూ 1000కి మించి ఉంటాయి. ఇతర పత్రికల్లో 100కు పైగా వ్యాసాలు రాసి ఉంటారు. కథానికలూ, కవితలూ రాశారు. పత్రికలో కొన్ని శీర్షికలని స్వయంగా నిర్వహించారు. చిత్రగుప్త, భావకవి, రామ్మూర్తి, యుగపతి సింహ, సంగ్రామసింహ మొదలైన ఎన్నో మారుపేర్లతో ఆయన అసంఖ్యాక రచనలు చేశారు.

1896 మే 28 తేదీన జన్మించిన సురవరం కర్నూలులో ప్రాథమిక విద్యాభ్యాసం చేశారు. వెల్లాల శంకరశాస్త్రి వద్ద సంస్కృత కావ్యాలు, వ్యాకరణం చదువు కొన్నారు. నిజాం కాలేజీలో ఎఫ్.ఎ. మద్రాసు ప్రెసిడెన్సి కాలేజిలో బి.ఏ. చదివిన తర్వాత బి.ఎల్. చదివి న్యాయవాద వృత్తిని చేపట్టారు. కాని ఎంతో కాలం ఆ వృత్తిలో ఉండలేక పోయారు.

గాంధీజీ నాయకత్వంలో సాగుతున్న స్వాతంత్ర్య పోరాటం ఆయనను ఆకర్షించింది. తెలంగాణ ప్రజల దైన్యం, దారిద్ర్యం, ప్రాథమిక హక్కులను కూడా నోచుకోని దుస్థితి చూచి చలించి పోయారు. భావుకుడైన రచయితగా, సురవరం కథలు నిజాం కాలం నాటి ప్రజల జీవితాన్ని ఉన్నదున్నట్లుగా చిత్రించినవి.

1924లో హైదరాబాద్ లోని రెడ్డి హాస్టల్ కార్యదర్శిగా నియమితులై, ప్రతాపరెడ్డి హాస్టల్ విద్యార్థులలో క్రమశిక్షణ నెలకొల్పి వారిని చైతన్య వంతులను కావించి, నాటి కొత్వాల్ అయిన రాజా బహదూర్ ఆశీస్సులతో 1926 మే 10వ తేదీన 'గోలకొండ' పత్రికను ప్రారంభించారు. పోలీస్ చర్య వరకు ప్రతాపరెడ్డి 'గోలకొండ' పత్రికా సంపాదకులుగా పనిచేసారు. 1930లో మెదక్ జిల్లా జోగిపేటలో జరిగిన మొట్టమొదటి 'ఆంధ్ర మహాసభ'కు అధ్యక్షత వహించారు. కార్యాకలాపాలన్ని తెలుగులోనే జరగాలంటూ తీర్మానం చేయించారు.

1951 లో ప్రతాపరెడ్డి పులిజాల హనుమంతరావు తో కలిసి 'ప్రజావాణి' దినపత్రికను స్థాపించి రెండేళ్ళు నడిపారు. ఆంధ్రుల చరిత్ర, సంస్కృతి పట్ల ప్రగాఢమైన అభిమానం ఉండేది. ప్రజలలో విజ్ఞాన వికాసానికి గొప్ప రచనలు చేశారు. తెలంగాణా ప్రజల భాషనుకాని, సంస్కృతినిగాని తక్కువ చేసి మాట్లాడితే సహించేవారు కాదు. తెలంగాణలో తెలుగు కవులు లేరన్న ముడుంబ వెంకట రాఘవాచార్య వ్యాఖ్యలకు స్పందించి, 354 మంది తెలంగాణ కవుల పరిచయాలతో కూడిన 'గోల్కొండ కవుల సంచిక'ను విడుదల చేశారు సురవరం.

ఆయన నిజాం రాష్ట్ర పాలన, మొగలాయి కథలు, సంఘోద్ధరణ, ఉచ్చల విషాదము, గ్రంథాలయము, హిందువుల పండుగలు, హైందవ ధర్మవీరులు, యువజన విజ్ఞానం మొదలైన రచనలు, దాదాపు 40 గ్రంథాలు రచించారు. సురవరం రచించిన 'ఆంధ్రుల సాంఘిక చరిత్ర'కు 'కేంద్ర సాహిత్య అకాడమి అవార్డు' లభించింది. దానిలో దాదాపు వెయ్యేళ్ల ఆంధ్రుల చరిత్రను నమోదు చేశారు. తెలంగాణలో గ్రంథాలయోద్యమంలో ప్రతాపరెడ్డి ప్రముఖపాత్ర వహించారు. 1942లో ఆంధ్ర గ్రంథాలయ మహాసభకు అధ్యక్షత వహించారు. 1943లో ఖమ్మంలో జరిగిన గ్రంథాలయ మహాసభకు, 1944లో జరిగిన ఆంధ్ర సారస్వత పరిషత్తుకు ఆయనే అధ్యక్షులు.

1952 లో జరిగిన శాసన సభ ఎన్నికల్లో, మిత్రుల ఒత్తిడిపై వనపర్తి నియోజకవర్గం నుండి కాంగ్రెస్ పక్షాన పోటీచేసి విజయం సాధించారు. కాని రాజకీయాలు ఆయనకంతగా రుచించలేదు. త్యాగము, దేశభక్తి, భాషాభిమానం ప్రజా శ్రేయస్సు పరమార్థంగా జీవించిన సురవరం ప్రతాపరెడ్డి 1953 ఆగష్టు 25న దివంగతులయ్యారు.

అయన సేవలు అందుకొనని సంస్థ తెలంగాణలో లేదంటే అతిశయోక్తి కాదు. ఆంధ్ర సారస్వత పరిషత్ అధ్యక్షులుగా పనిచేశారు. శ్రీ కృష్ణదేవరాయాంధ్ర భాషా నిలయం, వేమన ఆంధ్ర భాషా నిలయం, హిందీ ప్రచారసభ తదితర సంస్థల ప్రగతికి ఎంతో కృషి చేశారు.

తెలుగు జాతికి అయన చేసిన సేవలకు గుర్తింపుగా హైదరాబాదు లోని ట్యాంక్ బండ్ పై ప్రతిష్ఠించిన విగ్రహాలలో సురవరం విగ్రహం ఉంది. తెలుగు, హిందీ, ఉర్దూ, సంస్కృతం, ఫారసీ, ఆంగ్ల భాషలలో నిష్ణాతులుగా, పత్రికా సంపాదకులుగా, న్యాయవాదిగా, రచయితగా, సంఘ సంస్కర్తగా, ప్రజా ప్రతినిధిగా, చరిత్ర కారునిగా, పరిశోధకుడుగా, పండితుడుగా, క్రియాశీల ఉద్యమ కారుడుగా బహుముఖాలుగా సాగిన సురవరం ప్రతాపరెడ్డి ప్రతిభ, కృషి అనన్యమైనవి. తెలంగాణ సాంస్కృతిక చరిత్రలో సురవరం ఒక అధ్యాయం. ఆయన తెలుగు ప్రజలకు వరం..

మే 28...సురవరం ప్రతాపరెడ్డి జయంతి



**-రామ కిష్టయ్య సంగన భట్ల,**
9440595494



ఈనెల 10వ తేదీన హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ ఆడిటోరియంలో డాక్టరు పెళ్ళకూరు జయప్రదకు నవలా రచయిత్రిగా 'లైఫ్ ఎక్సీవ్‌మెంట్ అవార్డు'ను మరియు ఇరవై ఐదువేల కాష్ అవార్డ్‌తో సన్మానించిన అమృతలత, మంజు భార్గవి, నెల్లుట్ల రామాదేవి తదితరులు.


## విజయవాడ గ్రంథాలయ సందర్శన యాత్రకు ఆహ్వానం

హైదరాబాద్, మే 27(నేటినిజం ప్రతినిధి)గ్రంథాలయాలు మన జాతి విజ్ఞాన సంపదలు. వాటిని గుర్తించి గౌరవించడం ప్రతిఒక్కరి విధిగా భావించిన 'ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం' ప్రప్రథమంగాగ్రంథాలయ సందర్శన యాత్రకు పూనుకున్నది. చరిత్రలో మన సాహిత్య సంపదనుకాపాడుతున్న ఇటువంటి ప్రాముఖ్యత కలిగిన గ్రంథాలయాన్ని సందర్శించి గౌరవించడం ప్రతి రచయిత బాధ్యతగా భావించి 'ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం' ఈ గ్రంథాలయ సందర్శన యాత్రను నిర్వహిస్తు న్నది. పుస్తక పఠనం తగ్గుముఖం పట్టిన ఈ కాలంలో పుస్తక ప్రియులను ఆకర్షింపచేయడంతోపాటు, కవులు/ రచయితలు తమ రచన లను గ్రంథాయాలలో చూసి పులకరించే సందర్భాన్ని కలగజేయాలనే లక్ష్యంతో తొలుతగా 100 ఏళ్ళు పూర్తి చేసుకున్న ప్రకాశం జిల్లా వేటపాలెంలోని 'సారస్వత నికేతనం' గ్రంథాలయం, గుంటూరు 'అన్నమయ్య గ్రంథాలయాల సందర్శన యాత్ర నిర్వహించడం జరిగింది. ఈసారి విజయవాడలో 110 ఏళ్ళకు పైగా చరిత్ర గలిగిన చారిత్రాత్మక గ్రంథాలయాలను సందర్శింపచేయాలని రచయితల సంఘం పూనుకున్నది. ఇందులో హనుమంతరాయ గ్రంథాలయం, రామ్మోహన్ గ్రంథాలయంతోపాటు ఠాగూర్ పరిశోధనాత్మక గ్రంథాలయం, విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ గ్రంథాలయం, సర్వోత్తమ గ్రంథాలయాల సందర్శనలు ఒకేరోజు ఏర్పాటు చెయ్యడం జరుగుతోన్నది. జూన్ 28వ తేది ఉదయం నుండి సాయంత్రం వరకు జరిగే ఈ యాత్రకు బస్సు ఏర్పాటు చేయడంతోపాటు, సందర్శించాలనుకునేవారికి ఉచిత భోజనము, అల్పాహారం అందివ్వబడుతుంది. పాల్గొనేవారికి ప్రశంసాపత్రంతోపాటు శాలువా సత్కారం ఉంటుంది. ప్రముఖ రచయితలు, గ్రంథాలయోద్యమకారులు పాల్గొనే ఈయాత్రలో పలువురు రచయితల పుస్తకాల ఆవిష్కరణలు కూడా ఉంటాయి. కనుక ఈ యాత్రలో పాల్గొనదలచినవారు నెంబరులో జూన్ 10వ తేదిలోపు తమ పేర్లు నమోదు చేసుకోవాల్సిందిగా కోరుతున్నాము. జాతి ఔన్నత్యాన్ని తెలియజేసే ఈ సాహిత్యయాత్రకి అందరూ సహకరించవలసిందిగా 'ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం' కోరుతున్నామని డా॥ సి. భవానీదేవి, చలపాక ప్రకాష్ తెలిపారు.

## పెన్నా సాహిత్య పురస్కారం -2026

హైదరాబాద్, మే 27(నేటినిజం ప్రతినిధి)పెన్నా రచయితల సంఘం 17 వ వార్షికోత్సవం సందర్భంగాపెన్నా సాహిత్య పురస్కారం -2026 కు గాను....2025 జనవరి నుండి 2025 డిసెంబర్ వరకు ముద్రించ బడిన కవితాసంపుటాలను 4 కాపీలు కింది చిరునామకు పంపగలరని పెన్నా రచయితల సంఘం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు అవ్వారు శ్రీధర్ బాబు మరియు గోవిందరాజు సుభద్రా దేవి గార్లు తెలియ చేశారు.. చివరితేది **10 జూలై 2026.** వివరాలకు ఫోన్: **8500130770 , 9848627158**

నంబర్లను సంప్రదించగలరు. చిరునామా: **అవ్వారు శ్రీధర్ బాబు,** ఇ.నెం. 23-1-57, పెండెంవారి వీధి, ఫత్తేఖాన్ పేట, నెల్లూరు -524003.




Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.
'Editor: **BAISA DEVADAS.**
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com.